


SHIVA SURYA TELUGU DAILY

# శివసూర్య

RNI APTEL : 2023/88704

తెలుగు దిన పత్రిక



శివసూర్య

విలేకర్లు కావలెను

కర్నూలు జిల్లా, నంద్యాల జిల్లాల నుండి విడుదలవుతున్న సంచలన సమాచార దినపత్రిక శివసూర్య తెలుగు దినపత్రికలో పని చేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్సీ ఇంచార్జ్‌లు & మండల విలేకర్లు కావలెను.

ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.

ఎడిటర్ : బి. శివరాముడు

9494741301, 9346185399.

కర్నూలు సంపుటి : 03, సంచిక : 316 ఛీఫ్ ఎడిటర్.. పేజిలు : 08, వెల రూ. 2రూ/ ఆదివారం - 19 - జులై - 2026

Published From Kurnool : Circulated at Srikakulam, VishakaPatanam, Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa,

## ‘భారత్‌ను గర్వపడేలా చేశారు’... విక్రమ్-1 సక్సెస్ తర్వాత స్కైరూట్‌కు మోదీ ఫోన్!



విక్రమ్-1 విజయంపై స్కైరూట్‌కు మోదీ ఫోన్

‘భారత్‌ను గర్వపడేలా చేశారు’ అంటూ ప్రశంస

యువతపై తన నమ్మకం నిజమైందన్న ప్రధాని

## ముందు ఎన్సీపీ విలీనం.. తర్వాత ఎన్డీయేలోకి.. మహారాష్ట్రలో బీజేపీ మాస్టర్ ప్లాన్!



ఎన్సీపీ విలీనంపై జోరుగా చర్చలు

ముందు విలీనం.. తర్వాత ఎన్డీయే ఫార్ములా

15 రోజుల్లో తుది ప్రకటనకు అవకాశం

విలీనం లేకపోతే ప్రత్యేకంగానే ఎన్డీయేలో చేరే ఛాన్స్

అధ్యక్ష పదవిపై సునేత్రా పవార్ పట్టు

## మళ్లీ రేగిన ప్రత్యేక రాష్ట్ర నినాదం.. ఐదు రాష్ట్రాల గిరిజనుల మహా గర్జన!



ప్రత్యేక ‘భిల్ ప్రదేశ్’ కోసం గిరిజనుల భారీ సభ

ఢిల్లీ,: పశ్చిమ, మధ్య భారతదేశంలో సరిహద్దు ప్రాంతాలుగా ఉన్న ఐదు రాష్ట్రాల గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక రాష్ట్ర నినాదం మళ్లీ ఊపందుకుంది. రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతమైన దాద్రా నగర్ హవేలీల నుంచి తరలివచ్చిన వేలాది మంది గిరిజనులు..



## ‘నా అనుమతి లేకుండా చికిత్స వద్దు’.. సోనమ్ వాంగ్‌చుక్ భార్య విజ్ఞప్తి

కుటుంబ సమ్మతి, వైద్యుల అంగీకారం లేకుండా వైద్యం వద్దన్న గీతాంజలి

ఢిల్లీ,: తన అనుమతి, కుటుంబ సభ్యుల సమ్మతి లేకుండా సోనమ్ వాంగ్‌చుక్‌కు ఎలాంటి చికిత్స చేయొద్దని ఆయన భార్య గీతాంజలి జె.అంగ్మో విజ్ఞప్తి చేశారు. గత 20 రోజులుగా ఆయన ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తున్న వైద్యుల అంగీకారం లేకుండా నోటి ద్వారా గానీ, సిరల ద్వారా గానీ

# తెలంగాణ బీజేపీలో కీలక పరిణామం

ఈటల, బండి సంజయ్ మధ్య సయోధ్య దిశగా చర్చలు

నేతల విభేదాలకు చెక్ పెట్టాలని బీజేపీ హైకమాండ్ నిర్ణయించింది



హైదరాబాద్: తెలంగాణ బీజేపీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎంపీ లక్ష్మణ్ ఇంటికి బండి సంజయ్, ఈటల రాజేందర్ వెళ్లారు. ఈటల, బండి సంజయ్ మధ్య సయోధ్య దిశగా చర్చలు సాగుతున్నట్లు సమాచారం. పార్టీ అంతర్గత విభేదాలపై ఇప్పటికే హైకమాండ్‌కు నివేదిక ఇచ్చిన సంగతి తెలిసిందే. నేతల విభేదాలకు చెక్ పెట్టాలని బీజేపీ హైకమాండ్ నిర్ణయించింది. కాగా, కమలదళానికి కాయకల్ప చికిత్స సిద్ధమైంది.

# కాంగ్రెస్‌కు ‘డెత్ డిక్లరేషన్’ రాయాలి: కేటీఆర్

## నమ్మించి మోసం చేయడంలో రేవంత్ పీహెచ్‌డీ చేశారు

- ఆ మోసానికి సమాధానం చెప్పే సమయం వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- 38 నెలల క్రితం కాంగ్రెస్ మాటలు నమ్మి యువత దగా పడింది
- ప్రభుత్వం 70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు నిరూపిస్తే నేను శాశ్వతంగా రాజకీయాలు వదిలేస్తా
- రాహుల్ గాంధీ జేబులు రేవంత్ రెడ్డి నింపుతున్నారు
- ప్రజలు హామీలపై ప్రశ్నిస్తే హేళనగా మాట్లాడుతున్నారు
- రాష్ట్రంలో ఉన్మాద పర్వం నడుస్తోంది



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలతో యువతను మోసం చేసిందని, ఆ మోసానికి సమాధానం చెప్పే సమయం వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. యువత పిడికిలి బిగిస్తే పీఠాలు కదులుతాయి. కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా డెత్ డిక్లరేషన్ రాయాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు. నిరుద్యోగుల సమస్యలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, ప్రచారానికే పరిమితమైందని మండిపడ్డారు. సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన ‘యువ సంగ్రామ సభ’లో కేటీఆర్ మాట్లాడుతూ.. ‘కాంగ్రెస్ మోసం చేసిన సరూర్‌నగర్‌లోనే ‘యువ సంగ్రామ సభ’ నిర్వహించాం. 38 నెలల క్రితం కాంగ్రెస్ మాటలు నమ్మి యువత దగా పడింది. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయలేదు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ అమలు కాలేదు. అది చిత్తు కాగితంగా మారింది. ప్రభుత్వం 70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు నిరూపిస్తే నేను శాశ్వతంగా రాజకీయాలు వదిలేస్తా. ఇదే నా సవాల్. వాస్తవానికి 10 వేల ఉద్యోగాలు కూడా కాంగ్రెస్ ఇవ్వలేదు. నిరుద్యోగుల సమస్యలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా?. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, ప్రచారానికే పరిమితమైంది. రేవంత్ ప్రభుత్వం క్రెడిట్ చోరీ రాజకీయాలు చేస్తోంది. గత ప్రభుత్వంలో చేపట్టిన కార్యక్రమాలకూ తమదే ఘనతగా చెప్పుకుంటున్నారు.

## భారత అంతరిక్ష చరిత్రలో నవశకం.. తొలి ప్రైవేట్ రాకెట్ ‘విక్రమ్-1’ ప్రయోగం సక్సెస్

స్కైరూట్ ఏరోస్పేస్ ‘విక్రమ్-1’ రాకెట్ ప్రయోగం విజయవంతం

భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్‌గా రికార్డు సృష్టి

శ్రీహరికోట నుంచి నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్

‘ఆగమన్’ పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం చారిత్రాత్మకం

ప్రధాని సందేశంతో పాటు పలు పేలోడ్లను కక్ష్యలోకి మోసుకెళ్లిన ‘విక్రమ్-1’




ఢిల్లీ,: భారత అంతరిక్ష రంగంలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. దేశీయ ప్రైవేట్ స్పేస్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్, పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ‘విక్రమ్-1’ ఆర్బిటాల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో



## “జయ జయహే తెలంగాణ”

హైదరాబాద్: “జయ జయహే తెలంగాణ” గీతంతో తెలంగాణ ఆత్మగౌరవాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి, తన కలాన్ని ఉద్యమ జెండాగా మలిచి తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసిన ప్రజాకవి అందెశ్రీ గారి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు.

## రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం: కోమటిరెడ్డి వెంకటరెడ్డి



ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందిస్తామన్న కోమటిరెడ్డి

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని వ్యాఖ్య

పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్న మంత్రి

అమరావతి,: తెలంగాణ రాష్ట్రంలో గుడిసెలు అనేవే లేకుండా చేస్తామని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత పక్కా ఇల్లు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని

## హైదరాబాదులో పవన్ కల్యాణ్ ను పరామర్శించిన నారా లోకేశ్..



- గతంలో పవన్ భుజానికి గాయం
- ఇటీవల ముంబైలో విజయవంతంగా శస్త్రచికిత్స
- కొన్ని రోజుల కిందటే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి
- హైదరాబాదులోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న వైనం

# మోదీ దార్శనికతకు, భారతీయ ప్రతిభకు ప్రతీక

## - విక్రమ్-1 రాకెట్ విజయంపై పవన్ కల్యాణ్

- తొలి ప్రయత్నంలోనే ఘన విజయం సాధించిన స్కైరూట్
- విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్
- సరికొత్త ఆవిష్కరణల్లో ప్రపంచ దేశాల సరసన భారత్ నిలుస్తుందన్న పవన్



అమరావతి,: భారత అంతరిక్ష పరిశోధన రంగంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ.. దేశంలోనే తొలిసారిగా ఒక ప్రైవేట్ ఏరోస్పేస్ సంస్థ ‘స్కైరూట్’ రూపొందించిన ‘విక్రమ్-1’ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ‘మిషన్ ఆగమన్’ పేరుతో చేపట్టిన ఈ చరిత్రాత్మక ప్రయోగం విజయవంతం కావడం పట్ల ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ అద్భుత విజయాన్ని సాధించిన శాస్త్రవేత్తలకు, స్టార్టప్ బృందానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంతరిక్ష సాంకేతికత, సరికొత్త ఆవిష్కరణల్లో ప్రపంచ దేశాల సరసన భారతదేశాన్ని అగ్రగామిగా నిలపడానికి ఈ ప్రయోగం ఒక చక్కటి నిదర్శనమని పవన్ కల్యాణ్ కొనియాడారు. ఈ విజయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టమైన దార్శనికతకు, ఆయన అందిస్తున్న ప్రోత్సాహానికి దక్కిన ప్రతిఫలమని అభిప్రాయపడ్డారు. స్పేస్ రీసెర్చ్ రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ఆహ్వానించడం ద్వారా దేశంలో సరికొత్త స్టార్టప్‌ల అభివృద్ధికి,

## గోదావరిలో గల్లంతైన ఐదుగురూ మృతి.. చంద్రబాబు, పవన్ దిగ్భ్రాంతి



పోలవరం జిల్లా ఎటపాక మండలంలో విషాదకర ఘటన

గోదావరిన నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన గిరిజనులు

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న చంద్రబాబు

ఈ ఉదంతం కలచివేసిందన్న పవన్

అమరావతి,: పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు స్థానికులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు ఇలా మృత్యువాత పడటం అత్యంత విచారకరమని,

## పంచదార్ల కొండను మింగేస్తున్నారు.. పవన్ కల్యాణ్ ఏం ప్రాయశ్చిత్తం చేస్తారు?: కూటమి నేతలపై వైసీపీ ధ్వజం



- పంచదార్ల కొండపై అక్రమ మైనింగ్ చేస్తున్నారన్న గుడివాడ అమర్నాథ్
- వందల లారీల గ్రావెల్ తరలిస్తూ కొండను పిండి చేస్తున్నారని మండిపాటు
- సొంత కంపెనీల పేరుతో పర్మిట్లు తెచ్చుకుని కొండలను మాయం చేస్తున్నారన్న కన్నబాబు

## 'భారత్‌ను గర్వపడేలా చేశారు'..
## విక్రమ్-1 సక్సెస్ తర్వాత స్కైరూట్‌కు మోదీ ఫోన్!

ఢిల్లీ: భారత తొలి ప్రైవేట్ రాకెట్ విక్రమ్-1 ప్రయోగం విజయవంతమైన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ స్కైరూట్ బృందానికి ఫోన్ చేసి అభినందించారు. సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో సంబరాలు జరుగుతున్న సమయంలో వచ్చిన ఈ కాల్‌లో యువ శాస్త్రవేత్తల కృషిని ప్రధాని ప్రశంసించారు. స్కైరూట్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు పవన్ కుమార్‌తో మాట్లాడిన మోదీ.. "మీరు భారత్‌ను గర్వపడేలా చేశారు. భారత ఆశయాలను అంతరిక్షంలో నిలబెట్టారు. యువత కలలకు బలమైన పునాది వేశారు" అని అన్నారు. భారత యువతపై తనకున్న నమ్మకాన్ని ఈ బృందం నిజం చేసిందని కొనియాడారు. దీనికి పవన్ స్పందిస్తూ.. తమ బృందం సగటు వయసు కేవలం 28 ఏళ్లు మాత్రమేనని చెప్పారు. దీనిపై మోదీ మాట్లాడుతూ.. భారత యువతను నమ్మితే అద్భుతాలు చేయగలరని ఈ విజయం మరోసారి నిరూపించిందన్నారు. ఈ చారిత్రక క్షణంలో తాను కూడా భాగం కావాలనే ఉద్దేశంతోనే ఫోన్ చేసినట్లు చెప్పారు. 'ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ మిషన్ స్కైరూట్ ప్రయాణానికి ఆరంభం మాత్రమేనని, ముందు ఇంకా ఎన్నో విజయాలు సాధించాలని మోదీ ఆకాంక్షించారు. ఈ తొమ్మిది నిమిషాల సంభాషణలో భారత అంతరిక్ష రంగాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లినందుకు బృందాన్ని అభినందించారు. ప్రయోగానికి ముందు ప్రధాని చేతిరాతలో పంపిన 'వందేమాతరం' సందేశాన్ని విక్రమ్-1తో పాటు అంతరిక్షంలోకి తీసుకెళ్లినట్లు పవన్ తెలిపారు. దీనిపై స్పందించిన మోదీ.. జాతీయ గీతానికి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా, యువతకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలిచే సందేశం కావడంతోనే ఆ పదాలను రాశానన్నారు. చివరగా "ముందుకు సాగండి... మరింత ఎత్తుకు ఎగరండి... నేను మీ వెంటే ఉంటాను" అంటూ స్కైరూట్ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

## ముందు ఎన్సీపీ విలీనం.. తర్వాత ఎన్డీయేలోకి..
## మహారాష్ట్రలో బీజేపీ మాస్టర్ ప్లాన్!

ఢిల్లీ,: మహారాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (ఎస్పీ) ఎన్డీయేలో చేరే అవకాశాలపై చర్చలు జరుగుతున్న వేళ.. ముందుగా ఎన్సీపీ రెండు వర్గాలు విలీనం కావాలనే ఫార్ములాను బీజేపీ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ అంశంపై రెండు వర్గాల మధ్య లోతైన చర్చలు జరుగుతున్నాయని.. 15 రోజుల్లో తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు చెప్పినట్లు 'న్యూస్18' పేర్కొంది. 2023 జులైలో ఎన్సీపీ చీలిపోయిన తర్వాత అజిత్ పవార్ వర్గం బీజేపీ-శివసేన ప్రభుత్వంలో చేరింది. ఈ ఏడాది బరామతి సమీపంలో జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణించారు. అప్పటి నుంచి రెండు వర్గాల విలీనంపై మళ్లీ చర్చలు ఊపందుకున్నాయి. ఇటీవల ఎన్డీయే నేతలు, రెండు ఎన్సీపీ వర్గాల ప్రతినిధులు పలుమార్లు సమావేశమైనట్లు సమాచారం. ఒకవేళ విలీనం సాధ్యంకాకపోతే.. శరద్ పవార్ వర్గం ప్రత్యేక పార్టీగానే ఎన్డీయేలో చేరడం లేదా ప్రభుత్వానికి బయట నుంచి మద్దతు ఇవ్వడం వంటి ప్రత్యామ్నాయాలనూ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ వర్గానికి చెందిన ఎక్కువ మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు నేరుగా ఎన్డీయేలో చేరాలని కోరుకుంటున్నట్లు సమాచారం. కేంద్రం, మహారాష్ట్ర ప్రభుత్వాల్లో భాగమైతే పార్టీ బలోపేతానికి ఉపయోగపడుతుందని వారు భావిస్తున్నారని తెలుస్తోంది. విలీనం జరిగితే పార్టీ అధ్యక్ష పదవిని సునేత్రా పవార్‌కు ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. అలాగే మహారాష్ట్ర ఆర్థిక శాఖ తమ వర్గానికే ఇవ్వాలని ఆమె పట్టుబడుతున్నారని, శరద్ పవార్ వర్గం కూడా అదే శాఖపై ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు లోక్‌సభ స్థానాల సంఖ్య పెంపు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు పార్లమెంట్‌లో మళ్లీ ప్రవేశపెట్టాలని ఎన్డీయే భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ తరుణంలో లోక్‌సభలో ఎనిమిది మంది ఎంపీలు ఉన్న శరద్ పవార్ వర్గం మద్దతు కీలకంగా మారే అవకాశముందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## మళ్లీ రేగిన ప్రత్యేక రాష్ట్ర నినాదం..
## ఐదు రాష్ట్రాల గిరిజనుల మహా గర్జన!

మొదటి పేజి తరువాయి

రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతమైన దాద్రా నగర్ హవేలీల నుంచి తరలివచ్చిన వేలాది మంది గిరిజనులు.. శుక్రవారం రాజస్థాన్‌లోని బాన్స్‌వాడా జిల్లాలో ఉన్న చారిత్రక 'మాన్‌గఢ్ ధామ్' వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించారు. 'భీల్ ప్రదేశ్ ముక్తి మోర్చా' ఆధ్వర్యంలో పూర్తిగా సామాజిక, రాజకీయేతర నిరసనగా సాగిన ఈ సభలో.. గిరిజనుల కోసం ప్రత్యేకంగా 'భీల్ ప్రదేశ్' రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సభను ఉద్దేశించి బాన్స్‌వాడా-డుంగర్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గ ఎంపీ రాజ్‌కుమార్ రోత్ స్విట్జర్లాండ్ నుంచి ఫోన్ ద్వారా సందేశాన్ని అందించారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లవుతున్నా గిరిజన ప్రాంతాల్లో ఆశించిన అభివృద్ధి జరగలేదని, నాలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఈ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని ఆయన ఆరోపించారు. భారత్ ఆదివాసీ పార్టీ (బీఏపీ) జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ ఖరాడీ మాట్లాడుతూ.. గిరిజన సమాజం ప్రస్తుతం వివిధ రాష్ట్రాల సరిహద్దుల్లో ముక్కలైపోయిందని, దీనివల్ల సరిహద్దు ప్రాంతాల్లో నివసించే వారు ప్రతి స్థాయిలోనూ తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన సభ కాదని, తమ ఉనికి కోసం, హక్కుల కోసం చేస్తున్న పోరాటమని స్పష్టం చేశారు. ఉద్యోగాల్లో గిరిజనులకు రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో గిరిజన యువతకు వాటి ఫలాలు పూర్తిస్థాయిలో అందడం లేదని సభలో వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ రంగాలలో గిరిజనులపై జరుగుతున్న వేధింపులు, అణచివేతలపై కూడా వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చెల్లాచెదురుగా ఉన్న గిరిజన ప్రాంతాలన్నింటినీ ఏకం చేసి 'భీల్‌ప్రదేశ్' ఏర్పాటు చేస్తేనే సరిహద్దు ప్రాంతాల ప్రజల కష్టాలు తీరుతాయని నేతలు పేర్కొన్నారు. ఈ మహా సభకు భారత్ ఆదివాసీ పార్టీకి చెందిన పలువురు ప్రముఖ ఎమ్మెల్యేలు, నేతలు హాజరయ్యారు. ఏటా జులై 17న నిర్వహించే ఈ సదస్సు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అత్యంత క్రమశిక్షణతో, ప్రశాంతంగా ముగిసింది.

## 'నా అనుమతి లేకుండా చికిత్స వద్దు'..
## సోనమ్ వాంగ్‌చుక్ భార్య విజ్ఞప్తి

మొదటి పేజి తరువాయి

గత 20 రోజులుగా ఆయన ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తున్న వైద్యుల అంగీకారం లేకుండా నోటి ద్వారా గానీ, సిరల ద్వారా గానీ ఆయనకు ఎలాంటి చికిత్స అందించొద్దని 'ఎక్స్' వేదికగా కోరారు. 20 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న వాంగ్‌చుక్‌ను పోలీసులు శనివారం తెల్లవారుజామున ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు, వైద్య నిపుణుల సూచన మేరకు వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఉదయం నిరసన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ సమయంలో తోటి ఆందోళనకారులు నినాదాలు చేస్తూ అడ్డుకునే ప్రయత్నం చేయడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అయినా పోలీసులు అత్యంత సంయమనంతో చర్యలు చేపట్టినట్లు ఢిల్లీ డిప్యూటీ పోలీస్ కమిషనర్ వెల్లడించారు. జంతర్‌మంతర్‌ను శాంతియుతంగా ఖాళీ చేయాలని నిరసనకారులకు విజ్ఞప్తి చేశారు. వాంగ్‌చుక్ ఆరోగ్యంపై విచారణ జరపాల్సిన రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. ఆయనకు రోజూ వైద్య పరీక్షలు నిర్వహించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. ప్రతి పౌరుడి ప్రాణం విలువైనదేనని పేర్కొంటూ, అవసరమైన వైద్య సేవలు అందించాలని కేంద్రానికి సూచించింది. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలకు బాధ్యతవహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వాంగ్‌చుక్ ఈ నిరాహార దీక్ష చేపట్టారు. ఇదే డిమాండ్‌తో జులై 20న జంతర్‌మంతర్ నుంచి పార్లమెంట్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామని కూడా ప్రకటించారు.

## తెలంగాణ బీజేపీలో కీలక పరిణామం

మొదటి పేజి తరువాయి



కాగా, కమలదళానికి కాయకల్ప చికిత్స సిద్ధమైంది. బీజేపీ ప్రధాన రాజకీయ లక్ష్యమైన అధికార సాధన అనే కీలక ఘట్టానికి చేరడంలో రాష్ట్రపార్టీ ఎదుర్కొంటున్న బలహీనతలు, ఇబ్బందులను జాతీయ అధినాయకత్వం గుర్తించింది. రాష్ట్ర పార్టీలోని ముఖ్య నేతల ఈగోలు, సమన్వయలేమి అనేవి ప్రధాన సమస్యలుగా మారాయని గుర్తించి 'కీలెరిగి వాత'పెట్టేందుకు సమాయత్తమైనట్లుగా బీజేపీలోని అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ద్వారా తెలుస్తోంది. దశాబ్దాలుగా తెలంగాణలో బీజేపీకి గుర్తింపు ఉన్నా.. గత 10-15 ఏళ్లుగా పూర్తిస్థాయిలో రాజకీయంగా పుంజుకునే అవకాశాలున్నా వాటిని వినియోగించుకోకపోవడంపై జాతీయనాయకత్వం దృష్టి పెట్టినట్టు సమాచారం. తెలంగాణలో బీజేపీ పూర్తిస్థాయిలో పుంజుకుని, అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌లకు ఏకైక ప్రత్యామ్నాయంగా ఎదగకపోవడానికి ముఖ్యనేతలంతా 'ఎవరికి వారే యమునాతీరే'అన్నట్టుగా వ్యవహరిస్తుండడం ముఖ్యమైన సమస్యగా పరిణమించిందని వారు అభిప్రాయపడినట్లు తెలిసింది. పార్టీ బలంగా ఉన్న ఉత్తర తెలంగాణ జిల్లాల్లో (3 ఎంపీలు, 7 ఎమ్మెల్యేలు, 2 ఎమ్మెల్సీలు గెలుపు) ముఖ్యనేతల మధ్య గ్రూపుల సమస్య తీవ్రస్థాయికి చేరినట్లుగా వారు అంచనా వేసినట్లు సమాచారం. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో గ్రూపు రాజకీయాల కుంపట్లు తీవ్రస్థాయికి చేరుకోవడంతో ఇక వాటికి చెక్ పెట్టాల్సిన రోజులు దగ్గరపడ్డాయని అగ్రనేతలు గుర్తించినట్లు సమాచారం. ఏళ్ల తరబడి పార్టీ జెండా మోసిన సీనియర్ నేతలకు, కొన్నేళ్ల క్రితం చేరిన వలస నేతలకు మధ్య తీవ్రస్థాయిలో నడుస్తున్న కోల్డ్ వార్‌కు సైతం చరమగీతం పాడాలని నిర్ణయించినట్టు సమాచారం.

# భారత అంతరిక్ష చరిత్రలో నవశకం..
# తొలి ప్రైవేట్ రాకెట్ 'విక్రమ్-1' ప్రయోగం సక్సెస్

మొదటి పేజి తరువాయి



శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో వాణిజ్యపరంగా సొంతంగా ఆర్బిటాల్ రాకెట్లను అభివృద్ధి చేసి, ప్రయోగించిన అతికొన్ని దేశాల సరసన భారత్ నిలిచింది. 'మిషన్ ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం భారత ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ రాకను సూచిస్తుంది. తొలుత ఒక అంతర్గత సాంకేతిక సమస్య కారణంగా కౌంట్‌డౌన్‌ను నిలిపివేసినా, ఆ తర్వాత రాకెట్ ప్రణాళిక ప్రకారమే నిప్పులు చిమ్ముతూ ఆకాశంలోకి దూసుకెళ్లింది. రాకెట్‌కు సంబంధించిన నాలుగు దశలు అనుకున్నట్లుగానే పనిచేయడమే కాకుండా ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టే ప్రక్రియ కూడా తొలి ప్రయత్నంలోనే విజయవంతమైంది. ఈ చారిత్రక విజయం స్కైరూట్ బృందంలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

'విక్రమ్-1' ప్రత్యేకతలు

దాదాపు ఏడు అంతస్తుల ఎత్తు ఉండే విక్రమ్-1 రాకెట్‌ను పూర్తిగా కార్బన్ కాంపోజిట్ మెటీరియల్‌తో నిర్మించారు. ఇది 350 కిలోల బరువున్న పేలోడ్లను భూమికి సమీపంలోని కక్ష్య (లో ఎర్త్ ఆర్బిట్)లోకి మోసుకెళ్లగలదు. ఈ రాకెట్‌లో ఉపయోగించిన ప్రొపల్షన్ సిస్టమ్స్, అధునాతన 3డి-ప్రింటెడ్ ఇంజన్లు, హై-పెర్ఫార్మెన్స్ సాలిడ్ రాకెట్ మోటార్లు వంటి కీలక భాగాలన్నింటినీ స్కైరూట్ సంస్థే స్వయంగా అభివృద్ధి చేసింది. ఈ తొలి ప్రయోగంలో గ్రాహ్ స్పేస్, కాస్మోసర్వ్, డీక్యూబ్డ్ వంటి సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ పేలోడ్లతో పాటు, స్కైరూట్‌కు చెందిన 'స్కాప్' ప్రయోగాన్ని కూడా పంపించారు. వీటితో పాటు కొన్ని ప్రత్యేకమైన వస్తువులను కూడా అంతరిక్షంలోకి పంపారు. వాటిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వదస్తూరితో రాసిన 'వందేమాతరం' పోస్ట్‌కార్డ్, ఇస్రో ప్రస్తుత, మాజీ ఛైర్మన్లు, భారత వ్యోమగాములు, స్కైరూట్ ఉద్యోగులు, పెట్టుబడిదారులు రాసిన సందేశాలు ఉన్నాయి. ఈ విజయం కేవలం రాకెట్ పనితీరును నిర్ధారించడానికి పరిమితం కాదు. అంతరిక్ష రంగంలో ఇస్రోతో పాటు ప్రైవేట్ సంస్థలకు కూడా తలుపులు తెరుస్తూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలకు ఇది ఒక పెద్ద విజయంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ ప్రయోగం ద్వారా లభించిన కీలకమైన ఇంజనీరింగ్ డేటా, భవిష్యత్తులో విక్రమ్ సిరీస్ రాకెట్లను మరింత మెరుగుపరచడానికి, క్రమం తప్పకుండా వాణిజ్య ప్రయోగాలు చేపట్టడానికి స్కైరూట్‌కు సహాయపడుతుంది. ఇస్రో మాజీ శాస్త్రవేత్తలైన పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా 2018లో స్కైరూట్ ఏరోస్పేస్‌ను స్థాపించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న చిన్న ఉపగ్రహాల మార్కెట్‌కు తక్కువ ఖర్చుతో, నమ్మకమైన సేవలు అందించడమే లక్ష్యంగా వారు ఈ సంస్థను ప్రారంభించారు. 2022లో 'విక్రమ్-ఎస్' అనే సబ్-ఆర్బిటాల్ రాకెట్‌ను ప్రయోగించి, అంతరిక్షంలోకి రాకెట్‌ను పంపిన తొలి భారతీయ ప్రైవేట్ సంస్థగా స్కైరూట్ ఇప్పటికే చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. తాజా విజయంతో భారత అంతరిక్ష యానంలో ఇస్రోతో పాటు ప్రైవేట్ రంగం కూడా ఒక కీలక శక్తిగా నిలిచింది.

## "జయ జయహే తెలంగాణ"

మొదటి పేజి తరువాయి

ఉద్యమానికి ప్రాణం పోసిన ప్రజాకవి అందెశ్రీ గారి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ నేల ఆత్మను, ప్రజల ఆకాంక్షలను, ఉద్యమ స్ఫూర్తిని అక్షరాల్లో ఆవిష్కరించిన అరుదైన కవి అందెశ్రీ అని ముఖ్యమంత్రి కొనియాడారు. ఆయన కలం నుంచి జాలువారిన ప్రతి పదం తెలంగాణ ఉద్యమ చరిత్రలో చెరగని ముద్రగా నిలిచిందని, ప్రతి గేయం ప్రజల హృదయాల్లో ఆత్మగౌరవ జ్యోతిని వెలిగించిందని పేర్కొన్నారు. అందెశ్రీ గారి సాహిత్యం కేవలం కవిత్వం మాత్రమే కాదని, అది తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా, స్వాభిమానానికి స్వరంగా, భావితరాలకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచిందని ముఖ్యమంత్రి గారు అన్నారు. తెలంగాణ పట్ల ఆయనకున్న అచంచలమైన అంకితభావం, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత, సమాజానికి ఆయన అందించిన సాహిత్య సంపద చిరకాలం మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్ర ఉన్నంతకాలం ప్రజాకవి అందెశ్రీ గారి పేరు, ఆయన సాహిత్యం, ఆయన ప్రబోధించిన ఆత్మగౌరవ సందేశం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి, తరతరాలను చైతన్యపరుస్తూనే ఉంటాయని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు.

## రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం
## - కోమటిరెడ్డి వెంకటరెడ్డి

అమరావతి,: తెలంగాణ రాష్ట్రంలో గుడిసెలు అనేవే లేకుండా చేస్తామని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత పక్కా ఇల్లు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని ఆయన కొనియాడారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో రూ.184.15 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పరిగి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు కీలక వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇళు లేని పేద ప్రజలు సొంతంగా పక్కా ఇంటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని కోమటిరెడ్డి తెలిపారు. త్వరలోనే అర్హులైన మిగతా వారందరికీ ఇళ్లు ఇచ్చేందుకు రెండో విడత కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. వికారాబాద్ జిల్లాలో రోడ్ల నెట్‌వర్క్ బలోపేతం కోసం రూ.900 కోట్ల నిధులు మంజూరు చేయించామని, అందులో నుంచే పరిగి నియోజకవర్గానికి రూ.184.15 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రవాణా వ్యవస్థ మెరుగైతేనే పరిశ్రమలు వచ్చి స్థానిక యువతకు ఉపాధి పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి తీరుతామని మాట ఇచ్చిన మంత్రి కోమటిరెడ్డి... నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులతో పాటు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్నామని వివరించారు.

## హైదరాబాదులో పవన్ కల్యాణ్ ను పరామర్శించిన నారా లోకేశ్..

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శనివారం పరామర్శించారు. ఇటీవల ముంబయిలో భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కల్యాణ్‌ను లోకేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా "పవనన్న త్వరగా కోలుకోవాలి" అని ఆయన ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని లోకేశ్ అడిగి తెలుసుకున్నారు. భుజానికి అయిన గాయం, జరిగిన శస్త్రచికిత్స వివరాలను అడిగారు. వైద్యుల సూచనల మేరకు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. తన పరామర్శ అనంతరం లోకేశ్ మాట్లాడుతూ.. "డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారిని పరామర్శించాను. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించాను. వైద్యుల సూచనలు పాటిస్తూ వీలైనంత మేర విశ్రాంతి తీసుకోవాలని సూచించాను" అని తెలిపారు. గతంలో భుజానికి గాయం కావడంతో పవన్ కల్యాణ్ కొంతకాలంగా ఇబ్బంది పడుతున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో ఆయన కుడి భుజానికి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత ఆయన హైదరాబాద్‌లోనే ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు. పలువురు ప్రముఖులు ఆయన నివాసానికి వచ్చి పరామర్శిస్తున్నారు.

## కాంగ్రెస్‌కు 'డెత్ డిక్లరేషన్' రాయాలి: కేటీఆర్

మొదటి పేజి తరువాయి

గత ప్రభుత్వంలో చేపట్టిన కార్యక్రమాలకూ తమదే ఘనతగా చెప్పుకుంటున్నారు. నిరుద్యోగ భృతి, స్కూటీల పంపిణీ వంటి హామీలు అమలు కాకపోగా, లూటిఫికేషన్ మాత్రమే జరుగుతోందని ఎద్దేవా చేశారు. ఢిల్లీ నుంచి గాంధీలు, గాంధీ భవన్ నుంచి గాడ్సేలు వచ్చారు. రాష్ట్రంలో ఉన్మాద పర్వం నడుస్తోంది. పాత కేటుగాళ్ళు, కొత్త డూప్లికేట్ గాళ్ళు యువతను మోసం చేశారు. మోసం చేసిన వాళ్లను ఏమని అందాం. 60 ఏళ్ళు నెత్తురు రుచి మరిగిన కాంగ్రెస్ మాటలు నమ్మాం. అందరి కాళ్లు మొక్కి నిరుద్యోగులు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని కోరారు. రేవంత్ రెడ్డి భాషలో బెల్ట్ ట్రీట్మెంట్ ఇద్దామా? లాగులో తొండలు విడుద్దామా?. యువతతో పెట్టుకుంటే పుట్ట గతులు ఉండవు. కాంగ్రెస్ పార్టీకి డెత్ డిక్లరేషన్ రాయాలి. రాహుల్ గాంధీ జేబులు రేవంత్ రెడ్డి నింపుతున్నారు. అన్నదమ్ముళ్ల అల్మారాలు నింపుతున్నారు. తెలంగాణ విద్యార్థుల గుండెల్లో బుల్లెట్లు దింపింది కాంగ్రెస్ పార్టీ. కాంగ్రెస్ రక్త పిశాచి. రక్తం పంట పొలాల్లో చల్లాలని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు. రేవంత్ రెడ్డి ఓటుకు నోటు దొంగ. 50 లక్షలతో అడ్డంగా రేవంత్ రెడ్డి దొరికారు. క్రెడిట్ చోరీ చేయడానికి సిగ్గు అనిపించడం లేదా?. అబద్ధాలు చెప్పడానికి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ వాళ్లకు ట్రైనింగ్ ఇవ్వాలి. ఓటుకు నోటు దొంగ కుర్చీలో కూర్చున్నారు. రాహుల్ గాంధీ అశోక్ నగర్ వచ్చి బిస్కెట్లు తిని మనకు బిస్కెట్లు వేసి పోయారు' అంటూ సెటైర్లు వేశారు. ఉద్యోగాలు ఇవ్వాలని నిరసన తెలిపితే బూతులు తిడుతున్నారు. నిరుద్యోగులు ఉద్యోగాలు అడిగితే ఎండ్రిన్ తాగి చావమంటావా?. ఉద్యోగాలు ఎందుకు ఇ?వ్వరు.. మీ అయ్య జాగీరా?. ప్రజలు హామీలపై ప్రశ్నిస్తే హేళనగా మాట్లాడుతున్నారు. నమ్మించి మోసం చేయడంలో రేవంత్ పీహెచ్‌డీ చేశారు. తెలంగాణలో భూములు, బూడిద, ఇసుక లూటిషికేషన్ జరుగుతోంది. కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రపంచంలోనే అతి పెద్ద మోసం. బీఆర్ఎస్ కట్టిన ఫ్లైఓవర్లకు రేవంత్ సున్నాలు దిద్దుతున్నారు. మనం తెచ్చిన కంపెనీలకు రేవంత్ రిబ్బన్ కటింగ్ చేస్తున్నాడు. బడేభాయ్ రెండు కోట్లు, చోటా భాయ్ రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. నేను రాజు నేను హిట్లర్ అంటూ బట్లర్ మాటలు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ అధికార పీఠం.. నిరుద్యోగులకు బలిపీఠం' అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## మోదీ దార్శనికతకు,భారతీయ ప్రతిభకు ప్రతీక
## - విక్రమ్-1 రాకెట్ విజయంపై పవన్ కల్యాణ్

మొదటి పేజి తరువాయి

స్పేస్ రీసెర్చ్ రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ఆహ్వానించడం ద్వారా దేశంలో సరికొత్త స్టార్టప్‌ల అభివృద్ధికి, యువతలో వ్యవస్థాపక స్ఫూర్తిని రగిలించడానికి కొత్త అవకాశాలు వచ్చాయన్నారు. పట్టుదల, వినూత్న ఆలోచనలు ఉంటే ప్రైవేట్ రంగంలోనూ అద్భుతాలు సృష్టించవచ్చని ఈ ప్రయోగం నిరూపించిందని, ఇది ప్రతి యువ భారతీయుడికి ఒక బలమైన సందేశాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రయోగాన్ని విజయవంతం చేయడంలో ప్రైవేట్ రంగానికి వెన్నుదన్నుగా నిలిచిన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) పాత్రను పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రశంసించారు. శాస్త్రీయ నైపుణ్యాన్ని అందిస్తూ యువతను ప్రోత్సహించడంలో ఇస్రో ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. ఈ అద్భుత రాకెట్‌ను తయారు చేసిన 'స్కైరూట్ ఏరోస్పేస్' బృందంతో పాటు ఇస్రో, ఇన్-స్పేస్ సంస్థల శాస్త్రవేత్తలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ విజయగాథ రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలిచి, అంతరిక్ష రంగంలో భారతదేశాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## గోదావరిలో గల్లంతైన ఐదుగురూ మృతి..
## చంద్రబాబు, పవన్ దిగ్భ్రాంతి

మొదటి పేజి తరువాయి

ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు ఇలా మృత్యువాత పడటం అత్యంత విచారకరమని, బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే చంద్రబాబు అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన తుర్రం భారతి, ఊకే సుశీల, ఊకే లక్ష్మి, బాసిబోయిన బాలరాజు, ఊకే రమేశ్ అనే ఐదుగురు ఈ దుర్ఘటనలో మరణించినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. బాధిత కుటుంబాలకు తక్షణమే అవసరమైన ఆర్థిక, నిత్యావసర సహాయ సహకారాలు అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ దారుణ ఉదంతం తనను తీవ్రంగా కలిచివేసిందనిపవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన పోలవరం జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి, ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ.. ప్రభుత్వం తరపున వారికి ఎలాంటి లోటు రాకుండా సహాయ చర్యలు ముమ్మరం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఆమె ఫోన్‌లో మాట్లాడి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సాధారణంగా చేపల వేటకు వెళ్లే ప్రాంతంలో ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో సమగ్ర దర్యాప్తు జరపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు తక్షణ ప్రభుత్వ సాయం అందేలా చూడాలని జిల్లా యంత్రాంగానికి స్పష్టం చేస్తూ... మృతుల కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆమె ఆకాంక్షించారు.

## పంచదార్ల కొండను మింగేస్తున్నారు.. పవన్ కల్యాణ్ ఏం ప్రాయశ్చిత్తం చేస్తారు?: కూటమి నేతలపై వైసీపీ ధ్వజం

అమరావతి,: అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నియోజకవర్గ పరిధిలోని చారిత్రాత్మక పంచదార్ల కొండపై జరుగుతున్న అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా స్థానిక గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని వైసీపీ మాజీ మంత్రులు గుడివాడ అమర్నాథ్, కురసాల కన్నబాబు, దాడిశెట్టి రాజా, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, బొడ్డేడ ప్రసాద్ తదితరులు సందర్శించి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా కూటమి నేతల తీరుపై వైసీపీ నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కూటమి ప్రభుత్వ హయాంలో దోపిడీకి హద్దు అదుపు లేకుండా పోతోందని గుడివాడ అమర్నాథ్ మండిపడ్డారు. స్థానిక ఎంపీ సీఎం రమేశ్ అనకాపల్లి జిల్లాలో పంచభూతాలను దోచేస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. వందల లారీల గ్రావెల్ తరలిస్తూ కొండలను పిండి చేస్తున్నారని, 1200 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన పవిత్రమైన పంచదార్ల కొండను సైతం మింగేస్తూ మహా పాపానికి ఒడిగడుతున్నారని ధ్వజమెత్తారు. నిత్యం సనాతన ధర్మం గురించి మాట్లాడే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇక్కడ జరుగుతున్న విధ్వంసంపై ఎందుకు నోరు విప్పడం లేదని, ఈ పాపానికి ఆయన ఏం ప్రాయశ్చిత్తం చేసుకుంటారని నిలదీశారు. 'దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు' కూటమి నేతలు దోపిడీకి పాల్పడుతున్నారని మాజీ మంత్రి కన్నబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కడప నుంచి వచ్చిన సీఎం రమేశ్ ఇక్కడ ప్రజాసేవ చేస్తారనుకుంటే... తన సొంత కంపెనీల పేరుతో పర్మిట్లు తెచ్చుకుని కొండలను మాయం చేస్తూ పర్యావరణాన్ని దారుణంగా దెబ్బతీస్తున్నారని విమర్శించారు. తెల్లవారితే సనాతన ధర్మం అనే వాళ్లు ఉమా ధర్మలింగేశ్వర స్వామి ఆలయానికే గుండు కొడుతున్నారని ఆరోపించారు. ఇక్కడ జరుగుతున్న అన్యాయాన్ని తమ అధినేత జగన్ దృష్టికి తీసుకెళ్తామని, ఈ నెల 21న 'చలో పంచదార్ల' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రకటించారు. రాబోయే సోమవారంలోపు మైనింగ్ లీజులను రద్దు చేసి, 30 కిలోమీటర్ల పరిధిలోని ఈ కొండలను 'నో మైనింగ్ జోన్'గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మహాభారతంలో ప్రస్తావన ఉన్న, చోళుల కాలం నాటి ఉమా ధర్మలింగేశ్వర స్వామి ఆలయం వెలసిన ఈ పంచదార్ల కొండలు అత్యంత పవిత్రమైనవని దాడిశెట్టి రాజా గుర్తుచేశారు. సంపద సృష్టి అనే సాకుతో ఎక్కడి నుంచో వచ్చి ఉత్తరాంధ్ర వారసత్వ సంపదను దోచుకుంటుంటే ఇక్కడి సనాతనవాదులకు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ... పంచదార్ల కొండలపై కూటమి అనే అనకొండలు పడ్డాయని ఎద్దేవా చేశారు. ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే సుందరపు కుమార్ ఇద్దరూ గద్దల్లా కొండలను దోచుకుంటున్నారని, ప్రజలకు జీవనాధారమైన ఈ కొండల అక్రమ మైనింగ్‌పై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## రూ. 10 వేల లంచం కోసం
## మహిళను వివస్త్రను చేశారు: వరుదు కల్యాణి

అమరావతి,: గుంటూరు జిల్లాలో మహిళ పట్ల జరిగిన అమానుష ఘటనపై వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి పాలనలో సభ్య సమాజం తలదించుకునే పరిస్థితులు వచ్చాయని, అధికార పార్టీ నాయకులు కాలకేయుల్లా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవైందని, వారు స్వేచ్ఛగా బతికే వాతావరణం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు ఒక సాధారణ నీటి కుళాయి కనెక్షన్ కోసం మల్లెల మూర్తి అనే వ్యక్తి సదరు మహిళను రూ. 10 వేల లంచం అడిగాడని వరుదు కల్యాణి ఆరోపించారు. ఆ సమయంలో తలెత్తిన ఘర్షణ కారణంగానే ఆ మహిళను వివస్త్రను చేసి అమానుషంగా దాడికి తెగబడ్డారని పేర్కొన్నారు. ఈ దారుణంపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించినా తొలుత వారు పట్టించుకోలేదని, ఈ వైఫల్యానికి కూటమి ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అనాగరిక చర్యకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిందితుడు మల్లెల మూర్తి అధికార పార్టీకి చెందిన వ్యక్తి కాబట్టే... తప్పు కప్పిపుచ్చుకోవడానికి కేవలం సస్పెన్షన్ వేటు వేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. అధికార దుర్వినియోగానికి గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి పేటెంట్ అని ఎద్దేవా చేశారు.

## 2027 నాటికి పోలవరం పూర్తి
## గుడివాడ సభలో చంద్రబాబు కీలక ప్రకటన



అమరావతి,: ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి వంద శాతం పూర్తి చేసి తీరుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా గుడివాడలో పర్యటించిన ఆయన, అక్కడ జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' బహిరంగ సభలో మాట్లాడుతూ పోలవరం నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం అత్యంత శరవేగంగా ముందుకు తీసుకెళుతోందని ప్రకటించారు. గతంలో తాము కేవలం 12 నెలల రికార్డు కాలంలోనే పట్టిసీమ ప్రాజెక్టును పూర్తి చేసి కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలోని నదులన్నింటినీ అనుసంధానం చేయడం ద్వారా ఏపీలో కరవు అనే మాటే లేకుండా చేస్తామని భరోసా ఇచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుపై స్పందిస్తూ.. ఈ నెల నుంచే రాష్ట్రంలో 'తల్లికి వందనం' పథకాన్ని ప్రారంభించబోతున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. కృష్ణా జిల్లాకు ఎంతో ఘనమైన చారిత్రాత్మక నేపథ్యం ఉందని కొనియాడిన ముఖ్యమంత్రి, అభివృద్ధిలోనూ ఈ ప్రాంతాన్ని ముందంజలో ఉంచుతామన్నారు. కేవలం ప్రాజెక్టులే కాకుండా నగరాలు, గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణతో పాటు 'చెత్త నుంచి సంపద సృష్టి' చేయడమే తమ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

## స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం లో ఏకలవ్య విద్యార్థులకు శిక్షణ



మెళియాపుట్టి, శివ సూర్య జూలై 18: మెళియాపుట్టి మండలం పరిధి ఏకలవ్య స్కూల్ ఆవరణలో విద్యార్థులకు శిక్షణ, అవగాహన సదస్సు శనివారం వ్యవసాయ శాఖ, శ్రీకాకుళం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం లో భాగముగా మట్టి నమూనాలు తీసే విధానం, ల్యాబ్ లో పరీక్ష చేసే విధానం, మట్టి నమూనాలు ఆవశ్యకత ఉ సమస్యాత్మక పొలాలకు పరిస్కారాలు గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా రైతు శిక్షణా కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆర్ శ్రీనివాసరావు, వ్యవసాయ పరిశోధన స్థానం, రాగోలు శాస్త్రవేత్త డా. పి. ఉదయబాబు, కృషి విజ్ఞాన కేంద్రం, ఆమదాలవలస శాస్త్రవేత్త డా. ఎస్. కిరణ్ కుమార్, వ్యవసాయ అధికారులు వై సురేష్, దాన కర్ణుడు,గ్రామ వ్యవసాయ సహాయకులు జరిత,ఏకలవ్యవ స్కూల్ ప్రిన్సిపాల్ , సైన్స్ టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, శాస్త్రవేత్తలు మాట్లాడుతూ...ఎల్ ని నో ప్రభావం, పంటల మార్పిడి ఉ పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులు పై సవివరంగా తెలియపరిచారు.అదే విధముగా నేల ఆరోగ్యాన్ని కాపాడడంలో భాగంగా సేంద్రియ ఎరువులు, పచ్చి రొట్ట ఎరువులు, జీవన ఎరువులు ప్రాముఖ్యతను వివరిస్తూ రసాయన ఎరువులు వినియోగాన్ని తగ్గించుకోవాలని, మోతాదుకు మించి వాడకూడదని వివరించారు. అదేవిధంగా వరి పంటలో మేలైన యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు వివరించి ,వారి సమస్యలకు పరిస్కారం చెప్పడం జరిగింది. డ్రోన్ ద్వారా నానో ఎరువుల స్ప్రేయింగ్ చేసుకోవాలని రైతులకు సూచించారు.

## స్వర్ణాంధ్ర-- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పరిసరాలు పరిశుభ్రత తోనే చక్కని ఆరోగ్యం



మెళియాపుట్టి, శివ సూర్య జూలై 18: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం స్థానిక మెళియాపుట్టి పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోసమాల పి ఏ సి ఎస్ చైర్మన్ సలాన మోహనరావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నంబాల వెంకటరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పరిసరాలు పరిశుభ్రత తోనే చక్కని ఆరోగ్యం సొంతమవుతుందని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం అందరూ బాధ్యతని, అందరూ బాధ్యతగా స్వర్ణాంధ్ర -- సచ్చాంధ్ర నిర్మాణానికి కృషి చేయాలని కోరారు."స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివాస్" నినాదంతో జరుగుతున్న ఈ ఉద్యమం మన పరిసరాలు శుభ్రంగా ఉంచడంతో ప్రతి ఒక్కరిని ప్రేరేపిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో ప్లాస్టిక్ ని నిషేధించి స్వచ్ఛమైన స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం స్కూల్ పిల్లలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా, విద్యాశాఖ అధికారులు ఎస్ దేవేంద్రరావు, హౌసింగ్ ఏఈ గణేష్, ఉపాధి హామీ ఎపిఓ రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, సచివాలయ సిబ్బందితో పాటు స్థానిక నాయకులు గౌడు కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, యువత అధ్యక్షుడు బసవ పరమేశ్వర్ రెడ్డి, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు శ్రీరామ్ చాణిక్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## "ప్రజా దర్బార్" ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారం



మెళియాపుట్టి, శివ సూర్య జూలై 18: నిరంతరం ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడాని కె ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు పాతపట్నం శాసనసభ్యులు అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ మామిడి గోవిందరావు అన్నారు. గతంలో ఎమ్మెల్యే ని కలవడానికి గంటల తరబడి అపాయింట్మెంట్లు అవసరమని నేడు పాతపట్నం క్యాంపు కార్యాలయంలో నిరంతరం పనిచేస్తూ... ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ఇటువంటి ప్రజాదర్బార్ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేశారు. శనివారం పాతపట్నం టిడిపి కేంద్ర కార్యాలయంలో "ప్రజా దర్బార్" నిర్వహించి ప్రజల నుండి నేరుగా సమస్యలు తెలుసుకొని, వాటిని తక్షణమే పరిష్కరించేలా సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ ప్రజా ధర్బార్ లో 32 వినతి పత్రాలు ప్రజలు నేరుగా సమర్పించగా అందులో రెవెన్యూ, రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి ప్రధాన సమస్యలతో పాటు రేషన్ కార్డులు, పింఛన్లు, ఇల్లు స్థలాలు, గృహ నిర్మాణాలు,వృద్ధులు--వికలాంగులు--వితంతువుల వ్యక్తిగత వినతులు వచ్చేయ్ అన్నారు. ప్రజల వద్ద నుంచి సమస్యలపై వచ్చిన అర్జీలను 15 రోజులలో పరిష్కారం జరిగే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు.

## తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో క్యాడర్ సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే : ఎంజీఆర్

--- కార్యకర్తలే పార్టీ బలానికి మూలస్తంభాలు

---పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు



మెళియాపుట్టి, శివ సూర్య జులై 18 : పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు శనివారం పాతపట్నం టిడిపి కేంద్ర కార్యాలయంలో క్యాడర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ..., పార్టీ కోసం నిస్వార్థంగా శ్రమించే కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి నిజమైన బలమని పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు, బాధ్యతలు కల్పించడం తెలుగుదేశం పార్టీ ప్రత్యేకత అని అన్నారు.ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా వివరించడంతో పాటు, ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.నాయకత్వంపై విశ్వాసంతో సమిష్టిగా పనిచేస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని, రానున్న రోజుల్లో విజయాలు కార్యకర్తల కృషి పైనే ఆధారపడి ఉంటాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు ని కలిసిన వినతి పత్రం ఇచ్చిన ఎమ్మెల్యే

నియోజకవర్గం అభివృద్ధిపై సంపూర్ణ సహకారం అందించాలని వినతి హిరమండల కేంద్రంలో నూతన బీసీ,సాంఘిక సంక్షేమ వసతి గృహాలను మంజూరు చేయాలని విజ్ఞప్తినిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో ఏర్పాటు చేయాలని కోరారు నివగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు కాగువాడ స్కూల్ శాశ్వత భవనం మంజూరు చేయాలని కోరారుపాలిటెక్నికల్ కళాశాల మంజూరు వేగవంతం చేయాలని అభ్యర్థించిన ఎమ్మెల్యే ఎంజీఆర్



మెళియాపుట్టి, శివ సూర్య జూలై 18: పాతపట్నం శాసనసభ్యులు అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ మామిడి గోవిందరావు రాష్ట్ర విద్యా శాఖ మాత్యులు నారా లోకేష్ బాబు ని ఉండవల్లి నివాసంలో కలిసి పాతపట్నం నియోజకవర్గం సంపూర్ణ అభివృద్ధి చెందేందుకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నియోజకవర్గంలో హిరమండలం మండల కేంద్రం లో బీసీ,సాంఘిక సంక్షేమ వసతి గృహాలను మంజూరు చేయాలని, పాలిటెక్నికల్ కళాశాల మంజూరు వేగవంతం చేయాలని విన్నవించారు. అభలాసింగి ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే వినతులను స్వీకరించిన లోకేష్ బాబు సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు.

## ప్రభుత్వమిచ్చిన ల్యాండ్ సీలింగ్ భూములకు పంట బీమా ఆన్లైన్ చేసుకొనుటకు వర్తింపజేయాలి

ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

పరిగల ప్రకాష్ రాజ్ ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి



ఎమ్మిగనూరు,శివసూర్య, జూలై 18:ఆంధ్రప్రదేశ్లో ఖరీఫ్ 2026 పంటకు సంబంధించి ప్రధానమంత్రి ఫసలి భీమ యోజన మరియు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలకు ప్రభుత్వం ఇచ్చిన ల్యాండ్ సీలింగ్ భూములకు పంట బీమా వర్తించదు అంటూ పంట బీమా ఆన్లైన్ లో చేసుకో కోవడానికి లేనందున ఇబ్బందులు పడుతున్న రైతులు అదేవిధంగా పిఎం కిషన్ డబ్బులు కూడా ల్యాండ్ సీలింగ్ పొలాలు ఉన్న రైతులకు డబ్బులు పడడం లేదు అంటూ ఎమ్మిగనూరులో ఉన్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఎమ్మిగనూరు పరిధిలో ఉన్న మీసేవ కేంద్రాల దగ్గర ఎంతో ఆశతో రైతులు ఎదురుచూస్తూ ఉన్నారు కానీ ఆన్లైన్లో మాత్రం నమోదు చేసుకొనుటకు అవకాశం రాలేదన్న నిరాశా మిగిలింది ప్రతి ఒక్క రైతు కంట కన్నీరు తెప్పించే విధంగా ఉంది అంటూ మాట్లాడారు రైతులు కొంతమంది ఈ సంవత్సరం సరైన వర్షాలు లేక పంటలు సమంగా చేతికి రాక విత్తనాలు వేసిన భూముల్లో మొలకలొచ్చి వర్షం లేక అల్లాడుతున్న క్షణంలో ప్రభుత్వాలు ఈ విధంగా కూడా మమ్మల్ని ఇబ్బంది పెట్టడాన్ని మేము తట్టుకోలేకపోతున్నామంటూ తెలియజేయడం జరిగిందితక్షణమే ప్రభుత్వం స్పందించి ఆన్లైన్లో పంట బీమా నమోదు కు ఇబ్బందులు పడుతున్న ల్యాండ్ సీలింగ్ రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలి వెంటనే మీ సేవ కేంద్రాలలో ఆన్లైన్ ల్యాండ్ సీలింగ్ రైతులకు కూడా పంట బీమా ఆన్లైన్ చేసుకోవడానికి అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం లేనియెడల రైతులందరినీ తీసుకొని పెద్ద ఎత్తున కలెక్టర్ ఆఫీస్ ను మరియు సీఎం క్యాంప్ ఆఫీసును ముట్టడిస్తామని ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హెచ్చరిస్తున్నాం. ఇట్లు హరిజన జయన్న ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి పరిగల ప్రకాష్ రాజ్ మాదిగఎమ్మిగనూరు నియోజకవర్గం ఏపీ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గం అధ్యక్షులు నాగేష్ మాదిగఎమ్మిగనూరు తాలూకా ప్రధాన కార్యదర్శి విజయ్ మాదిగ ఎమ్మిగనూరు తాలూకా ఉప అధ్యక్షులు సురేష్ మాదిగఏపీ ఎమ్మార్పీఎస్ మంత్రాలయం నియోజకవర్గం అధ్యక్షులు జి నేపాల్ పెద్దకడబూరు మండలం అధ్యక్షులు హెచ్ ఆశీర్వాదంఏపీ ఎమ్మార్పీఎస్ కదిరికోట రంగన్న టౌన్ అధ్యక్షులుఎమ్మార్పీఎస్ మండల నాయకులు ఇర్మియ ఆరెకంటి రాజు

## ఋష్యశృంగ మహర్షికి 108 కలశాలతో మహా కుంభ అభిషేకం



గద్వాల, శివసూర్య: జులై 18 జోగులాంబ గద్వాల జిల్లా పెద్దదిన్నె గ్రామంలో నిర్వహిస్తున్న వరుణయాగ మహోత్సవాల్లో భాగంగా ఋష్యశృంగ మహర్షి విగ్రహానికి 108 కలశాలతో వైభవంగా మహాభిషేకం నిర్వహించారు.ముందుగా 108 కలశాలతో ప్రత్యేక కలశపూజను వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి శిష్యబృందం, వేదపండితులు సత్యప్రకాశ్ స్వామీజీ మిత్రబృందం ఆధ్వర్యంలో ఋష్యశృంగ మహర్షికి మహా కుంభ అభిషేకం, అనంతరం వరుణయాగం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని వికాస తరంగిణి అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షులు (డి.డి.ఎన్.ఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు చక్రవర్తి చార్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ముందుగా 108 కలశాలతో ప్రత్యేక కలశపూజను వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి శిష్యబృందం, వేదపండితులు సత్యప్రకాశ్ స్వామీజీ మిత్రబృందం ఆధ్వర్యంలో ఋష్యశృంగ మహర్షికి మహాభిషేకం, వరుణయాగం అత్యంత కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## డి.డి.ఎన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చక్రవర్తి చార్యులను ఘనంగా సత్కరించిన అర్చక సంఘం సభ్యులు



గద్వాల, శివసూర్య జూలై 18: జోగులాంబ గద్వాల జిల్లా బ్రాహ్మణ సంఘం, అర్చక సంఘం సభ్యులు డి.డి.ఎన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. చక్రవర్తి చార్యులు గారిని ఘనంగా సత్కరించారు. సత్యప్రకాశ్ స్వామీజీ మిత్రబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పూలమాలలు, శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, బ్రాహ్మణ సంఘం నాయకులు, అర్చక సంఘం సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యక్షులు చక్రవర్తి చార్యులు అర్చకుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తూ, వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. అర్చకుల సంక్షేమం, ప్రభుత్వ పథకాల అమలు, సామాజిక భద్రత, గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన చర్యల కోసం సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ అర్చకుల సంక్షేమం కోసం చక్రవర్తి చార్యులు అహర్నిశలు శ్రమిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సేవలందిస్తున్నారని కొనియాడి, వారి సేవలను అభినందిస్తూ ఘనంగా సత్కరించారు.

## నేడు జరిగిన వరుణ యాగం సఫలీకృతం రాష్ట్ర ఉపాధ్యక్షులు చక్రవర్తి చార్యులు



గద్వాల, శివసూర్య జూలై 18: జోగులాంబ గద్వాల జిల్లా పెద్దదిన్నె గ్రామంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి వారి మంగళాశాసనాలతో వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన వరుణ యాగం విజయవంతంగా ముగిసింది.యాగం అనంతరం కురిసిన వర్షం ఎంతో శుభసూచకమని ధూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చక్రవర్తి చార్యులు తెలిపారు. లోక సంక్షేమం, రైతుల శ్రేయస్సు, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని సంకల్పంతో ఈ వరుణ యాగాన్ని నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా వికాస తరంగిణి అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, గ్రామ సర్పంచ్, వికాస తరంగిణి సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని యాగ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

## నేడు గురుపూజోత్సవ కార్యక్రమం విజయవంతం -- రాష్ట్ర ఉపాధ్యక్షులు చక్రవర్తి చార్యులు



గద్వాల, శివసూర్య జూలై 18: జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మున్సిపాలిటీ కొత్త బస్టాండ్ సమీపంలోని శ్రీ అంబా భవాని దేవాలయంలో నేడు గురుపూజోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడిందని డి.డి.ఎన్.ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చక్రవర్తి చార్యులు తెలిపారు.ఈ సందర్భంగా భారతమాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేశాభివృద్ధి, ధర్మ పరిరక్షణ, సమాజ శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, అశోక్, భరత్ రెడ్డి, మధు, ఆర్ఎస్ఎస్ సంఘ సభ్యులు, ఆచార్య సంపర్క్ ప్రముఖులు, చక్రవర్తి చార్యులు మరియు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.గురుపూజోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ చక్రవర్తి చార్యులు అభినందనలు తెలియజేస్తూ, భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## జర్నలిస్టులకు చంద్రశేఖర్ ప్రసాద్ 'భరోసా' -- శేరిలింగంపల్లి వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఉచిత హెల్త్ ఇన్సూరెన్స్

-- ప్రీమియం మొత్తం నేనే భరిస్తా

-- టీఆర్ఎస్ శేరిలింగంపల్లి అధ్యక్షుడు వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్

శేరిలింగంపల్లి :శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వర్కింగ్ జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం టీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి అధ్యక్షుడు వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ భారీ ప్రకటన చేశారు. నియోజకవర్గ పరిధిలోని అందరు జర్నలిస్టులకు ఉచిత హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తానని, దానికి అవసరమైన పూర్తి బీమా ప్రీమియంను తానే భరిస్తానని ఆయన ప్రకటించారు.ఇటీవల టీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విడుదల చేసిన నియోజకవర్గ ఇన్చార్జిల తొలి జాబితాలో చోటు దక్కించుకున్న చంద్రశేఖర్ ప్రసాద్.. శుక్రవారం మియాపూర్లోని శుభం కన్వెన్షన్ హాల్లో జరిగిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఈ విషయాన్ని వెల్లడించారు.

### సమస్యలపై సానుకూల స్పందన..

కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షుడు ధూపం ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాసేవలో రాత్రింబవళ్లు శ్రమిస్తున్న జర్నలిస్టులకు సరైన ఆరోగ్య రక్షణ లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల కుటుంబాలకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు.దీనికి స్పందించిన వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్.. శేరిలింగంపల్లి పరిధిలోని వర్కింగ్ జర్నలిస్టులందరి ఇన్సూరెన్స్ బాధ్యతను తానే తీసుకుంటున్నట్లు సభాముఖంగా ప్రకటించారు.

## శ్రీ జిగిని టెక్స్టైల్ 69వ వార్షికోత్సవం.

.శ్రీ జగిని టెక్స్ టైల్స్ 69 వ వార్షికోత్సవ బంపర్ డ్రా మా సంస్థ నందు నిర్వహించారు. డ్రా కు ముఖ్య అతిథి గా ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి చేతుల మీదుగా జరిగింది , కార్పొరేటర్ హాజీ , కస్టమర్స్ పాల్గొన్నారు ఇలాగే మా జగిని టెక్స్ టైల్స్ ముమ్మందు చాలా కార్యక్రమం లు చేసుకోవాలని కోరుకుంటూనారు .1)బంపర్ బహుమతి హోండా యాక్టివాలక్కీ కూ పన్ నెంబర్ 734ఎం వంశీ కృష్ణ జన్నారెడ్డి 2)కన్సలేషన్ :1139 ఎం. నాగేంద్ర..3) కన్సలేషన్ : 0129రాచమళ్ళ సాషా

### కౌన్సిలర్ను పరామర్శించిన మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్చార్జి దయాకర్ రెడ్డి

ఎదులాపురం :ఏదులాపురం మున్సిపాలిటీ ఏదులాపురం మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ ఏనుగు స్వరూప గత 12 రోజులుగా తీవ్ర మోకాలి నొప్పితో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి శుక్రవారం ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు.స్వరూప ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన, ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## సాయి పాపులర్ షు స్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం జులై 18 భీమవరం పాత సత్యనారాయణ థియేటర్ పక్కన సాయి పాపులర్ షూ స్ ను శనివారం రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు అంజిబాబు ప్రారంభించారు భీమవరం పట్టణం ఎంతో అభివృద్ధి చెందుతుందని ప్రతి వ్యాపార రంగం మరింత అభివృద్ధి చెందాలన్నారు షాపు నిర్వాహకులు మాటూరు అప్పలరాజు మాట్లాడుతూ మగవారికి ఆడవారికి కావలసిన అన్ని రంగుల పాద రక్షలను లభ్యమవుతాయి అన్నారు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు ఒబిలి శెట్టి రామకృష్ణ సుంకర రవి తదితరులు పాల్గొన్నారు

## ఏఐకేఎంఎస్ మహాసభల కరపత్రాల ఆవిష్కరణ




శ్రీకాకుళం జిల్లా పలాస వేదిక: పలాస మండలం బొడ్డపాడు లోని అమర వీరుల స్మారక మందిరం వద్ద ఈ కరపత్రాలను ఆవిష్కరించారు.సందర్భం: శనివారం రోజున ఏఐకేఎంఎస్ జిల్లా 11వ మహాసభల కరపత్రాలను విడుదల చేశారు.మహాసభల వివరాలు: జూలై 25న శ్రీకాకుళం లోని కళింగ భవన్‌లో ఈ మహాసభలు జరగనున్నాయి. ఈ సభలను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు వంకల మాధవరావు కోరారు.ప్రధానాంశాలు ఽ చర్చలు: రైతులకు గిట్టుబాటు ధరలు, రుణమాఫీ, సాగునీటి ప్రాజెక్టులు, మరియు వంశధార-నాగావళి అనుసంధానం వంటి కీలక అంశాలపై చర్చించి, భవిష్యత్తు పోరాట కార్యాచరణను రూపొందిస్తామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.

## శాఖల సమస్యలపై సర్వసభ

### సమావేశంలో అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు



కౌతాళం, జూలై 18 కౌతాళం మండల సర్వసభ సమావేశంలో ప్రజలకు సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. అంగన్వాడీ, త్రాగునీరు, రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయం, పశు సంవర్ధక శాఖ, విద్యాశాఖ, శ్రీ శక్తి సంఘాల పనితీరుపై సభ్యులు అధికారులను ప్రశ్నించారు.అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు, చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం నాణ్యత, ఖాళీ పోస్టుల భర్తీ వంటి అంశాలను ప్రస్తావించారు. గ్రామాల్లో త్రాగునీటి సమస్యలు, చెడిపోయిన బోర్లు, పైప్‌లైన్ లీకేజీలు, కొత్త నీటి వనరుల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని కోరారు.రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ సమస్యలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, పట్టాదారు పాస్‌బుక్కులు, భూ రికార్డుల సవరణలపై అధికారులు త్వరితగతిన స్పందించాలని సభ్యులు సూచించారు.విద్యుత్ శాఖపై ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ గోడల నిర్మాణం, తరచూ జరుగుతున్న విద్యుత్ అంతరాయాలపై ప్రశ్నలు లేవనెత్తారు.వ్యవసాయ శాఖలో రైతులకు ఎరువులు, విత్తనాల సరఫరా, పంటలపై అవగాహన కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలుపై వివరాలు కోరారు. పశుసంవర్ధక శాఖలో పశువైద్య సేవలు, వైద్యుల కొరత, గోకులం షెడ్లలో పశువులకు అందుతున్న సేవలపై చర్చ జరిగింది.విద్యాశాఖలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల ఖాళీలు, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై సభ్యులు అధికారులను నిలదీశారు. శ్రీ శక్తి సంఘాలకు రుణాల మంజూరు, స్వయం ఉపాధి అవకాశాలు, మహిళా సంఘాల, అలాగే మిగతా వాటి గురించి కూడా అభివృద్ధి కిబలోపేతానికి తీసుకుంటున్న చర్యలపై కూడా చర్చించారు.సభలో సభ్యులు ప్రజా సమస్యల పరిష్కారానికి శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని అధికారులను కోరగా, అధికారులు సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశం మొత్తం ప్రజా సమస్యల పరిష్కారంపైనే ప్రధానంగా సాగింది.

## పారిజాత గిరి మహాగిరి ప్రదక్షణ కరపత్రాన్ని ఆవిష్కరణ చేసిన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈవో ఆర్ వి . చందన

ఏలూరు జిల్లా ,జంగారెడ్డిగూడెం ,జులై 18 ()పారిజాతగిరి మహా గిరి ప్రదక్షిణ కరపత్రాన్ని ఆవిష్కరణ చేసిన ధర్మకర్తలు మండలి చైర్మన్, ఈఓ అసిస్టెంట్ కమిషనర్ ఆర్ వి .చందన గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం జంగారెడ్డిగూడెం ఉత్తరం వైపు ఏడుకొండలలో ఆరువ కొండపై పారిజాత వృక్షాల్లో వేంచేసి యున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ప్రీతికరమైన





రోజు శనివారం కావడంతో ఈరోజు వేకువ జామున నాలుగు గంటల 30 నిమిషాలకు సుప్రభాతం సేవ ఆరాధన తీర్థ ప్రసాద గోష్టి బాల భోగ నివేదన అనంతరం భక్తులకి విశేషమైన అలంకరణలో దర్శనం కల్పించారు ఆలయ రవికుమార్ ఆచార్యులు ఉదయం 5 గంటల నుండి ఆలయ గిరి ప్రదక్షిణ మొదటి భాగంలో భూ వరస్వామి దర్శనం అనంతరం వేలాదిగా వచ్చిన భక్తులు కంకణ దారణతో కాలినడకన ఏడుకొండలు గిరి ప్రదక్షణ చేసి శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈరోజు వేలాది వచ్చిన భక్తులకు అన్నదానం అన్న ప్రసాద వితరణ ఆలయం తరపున అన్న ప్రసాదం జరిపించినారు(తొలి ఏకాదశి )సందర్భంగా ది 25-07-2026శనివారం ఉదయం 8-44నిషాలకు గిరి ప్రదక్షిణ మొదటి మార్గంలో భు వరాహస్వామి ఆలయం నుండి ఆలయం అర్చకులు ధర్మకర్తల మండలి చైర్మన్ సభ్యులు ఈవో ఆర్ వి .చందన అభివృద్ధి కమిటీ సభ్యులు మరియు భక్తులు కోలాటం, వికాస తరంగిని, దాతలు, వాహన సేవ తో ఆలయకళ్యాణం ఉత్సవామూర్తులు తోగోవిందా నామస్మరణతో (మహాగిరి ప్రదక్షిణ )కార్యక్రమం వైభవం గా జరుగుతుంది అని తెలిపారు వేలాది భక్తులకు భారీ అన్నప్రసాదం జరుగుతుంది తెలిపారు, ఈ పూజా కార్యక్రమం లో పాల్గొన్ని శ్రీస్వామి వారి అనుగ్రహం పొందవలసిందిగా కోరుకుంటున్నాము ఈ పూజాకార్యక్రమములో ఆలయ చైర్మన్ అల్లూరి రామకృష్ణ, అన్నప్రగ వీరాఘర్రావు, కొప్పుల నాగ సూరంద్ర, ఆరెపల్లి నాన్ని, మద్ది ప్రసాద్,వడిగళ్ల కుమారి, ముప్పిడి భాను, మరియు అభివృద్ధి కమిటీ చైర్మన్ అబ్బీన దత్తత్రేయ,పెరిచర్ల జగపతిరాజు, గొట్టుముక్కల భాస్కరాజు, వాసవి సాయి నగేష్,ధనరాజు,ఫణి,మొదలుగు వారు పాల్గొన్నారు అని తెలియజేస్తున్నారు ఈరోజు ఆలయం ఆదాయం పూజా టికెట్స్ ద్వారా ప్రసాదాలు, విరాళాలు, అన్నదానం విరాళాలు రూ మొత్తం 1,11,990=00వచ్చినట్లుతెలియజేసారు ఆలయ ఈవో అసిస్టెంట్ కమిషనర్ ఆర్ వి . చందన తెలిపారు.

## ,లింగపాలెం మండలం శ్రీ విద్యా హై స్కూల్ ధర్మాజీగూడెం ఎస్ఐ కె .వెంకన్న కొత్త చట్టాలు మరియు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు




ఏలూరు జిల్లా ,లింగపాలెం ,జులై 18 ( )ఏలూరు జిల్లా.. లింగపాలెం మండలం.ఈరోజు శ్రీవిద్య హై స్కూల్ ధర్మాజీగూడెం లో ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఖ. వెంకన్న కొత్త చట్టాలు మరియు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మాట్లాడుతూ ఫోక్సో చట్టం, సైబర్ నేరాలు మరియు బాల్య వివాహాల చట్టాలపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో శ్రీవిద్య హై స్కూల్ మరియు శ్రీ చక్ర కాలేజీ ల విద్యార్థిని విద్యార్థులు, పాఠశాల డైరెక్టర్.సిహెచ్ . రత్నాకర్ రావు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొద్దిపాటి వర్షానికే చెరువుగా మారుతున్న రహదారి -- ప్రజలకు నిత్య నరకం



కౌతాళం: ప్రతినిధి జూలై 18( )కొద్దిపాటి వర్షం కురిసినా చాలు... రహదారిపై భారీగా నీరు నిలిచి చెరువును తలపించే పరిస్థితి నెలకొంటోంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, రోడ్డు ఎత్తు సక్రమంగా లేకపోవడం వల్ల వర్షపు నీరు బయటకు వెళ్లక రహదారిపైనే నిలిచిపోతోంది.ఈ పరిస్థితితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలు జారిపడే ప్రమాదం ఉండటంతో పాటు, పాదచారులు కూడా రోడ్డుపై నడవలేని పరిస్థితి ఏర్పడుతోంది. వ్యాపార సంస్థల ఎదుట నీరు నిలవడంతో వ్యాపారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు.నిల్వ నీటిలో దోమలు పెరిగే అవకాశం ఉండటంతో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని వాపోతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు రహదారిని మరమ్మతు చేసి వర్షపు నీరు నిల్వ కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగించే ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకుండా శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## పలువురి ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్



భీమవరం జులై 18 ప్రతినిధి మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ శనివారం పలువురిని పరామర్శించారు చిన మిరం గ్రామానికి చెందిన గొట్టుముక్కల వెంకట భారతం ఇటీవల కాలం చేశారు మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చిన మిరం గ్రామానికి వెళ్లి గొట్టుముక్కల వెంకట భీమరాజు కుటుంబ సభ్యులను పరామర్రించారు ముందుగా భారతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు

## పెద్ద గురువు లో వ

భీమవరం జులై 18 వైసీపీ రాష్ట్ర కార్యదర్శి భీమవరం ఎంపీపీ పేరిచర్ల విజయ్ నరసింహారాజు



మాతృమూర్తి కృష్ణవేణి ఇటీవల కాలం చేశారు మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పెద్ద గురువు గ్రామానికి వెళ్లి కృష్ణవేణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు

## ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థుల విద్య, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

**ఒంగోలులోని సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు నైట్ డ్రెస్, స్వెటర్స్ , షూస్, టర్కీ టవళ్ళు, బెడ్ షీట్స్, ట్రంక్ పెట్టెలు పంపిణీ చేసిన మంత్రి డా. స్వామి**

ఒంగోలు జూలై 18 న్యూస్.ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థుల విద్య, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం




పెద్దపీట వేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఒంగోలులోని జేడీ శీలం భవనంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు నైట్ డ్రెస్, స్వెటర్స్ , షూస్, టర్కీ టవళ్ళు, బెడ్ షీట్స్, ట్రంక్ పెట్టెలు, ప్లేట్, గ్లాసులు మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. లావణ్య వేణి శుక్రవారం రాత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, డా. బి.ఆర్ అంబేద్కర్ గురుకులాల విద్యార్థులకు నైట్ డ్రెస్, స్వెటర్స్ , షూస్, టర్కీ టవళ్ళు, బెడ్ షీట్స్, ట్రంక్ పెట్టెలు, ప్లేట్, గ్లాసు పంపిణీ చేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థుల విద్య, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఆ వర్గాల పిల్లలు చదువుకుంటేనే వారి కుటుంబాల్లో పేదరికం నిర్మూలించవచ్చన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.143 కోట్లతో హాస్టళ్లకు మరమ్మతులు చేశాం. రూ. 200 కోట్లతో నూతన హాస్టళ్లు నిర్మిస్తున్నాం. బాలికల భద్రత కోసం హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం డాక్టర్స్ బృందం ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మూడు ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లు, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెండు ఎక్సలెన్సీ సెంటర్లు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒక ఎక్సలెన్సీ సెంటర్ ఏర్పాటు చేశాం. వీటిలో విద్యార్థులకు ఇంటర్ తో పాటు జేఈఈ మెయిన్స్, ఐఐటీ, నీట్ కి ఉచిత శిక్షణ ఇస్తున్నాం. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ భాషలో ఉచిత శిక్షణ ఇచ్చి జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. ఈ ఏడాది ఇజ్రాయిల్ లో కూడా ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు గ్రూప్ 1, గ్రూప్ 2, డీఎస్సీ ఆర్ఆర్బీ, రైల్వే కోచింగ్ కి ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నాం. కౌసల్యం ద్వారా గ్రామాల్లో యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి వర్క్ ఫ్రం హోం అవకాశాలు కల్పిస్తున్నాం. పేద విద్యార్థులు, యువత అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేసీ పి. కల్పనా కుమారి, డీడీ లక్ష్మ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కోరిన కోరికలు తీర్చే శ్రీ లక్ష్మీనరసింహ ఈరణ్ణ స్వామి.




కౌతాళం ప్రతినిధి జూలై 18 సామి వార్ల దేవస్థానము ఉరుకుంద గ్రామము - 518344. కౌతాళం మం, కర్నూలు జిల్లా. (ఆం.ప్ర) 30 2026 శ్రావణమాస ఉత్సవాలు తేది: 13-08-2026 గురువారం నుండి 11-09-2026 శు క్రవారం వరకు శ్రీ స్వామి వారి విశేష వారములు (133) తేది: 13-08-2026 మొదటి గురువారం తేది: 20-08-2026 రెండవ గురువారం తేది: 27-08-2026 మూడవ గురువారం ?: 03-09-2026 3 తేది: 10-09-2026 ఐదవ గురువారం ా శ్రీ స్వామి వారి విశేష వారములు తేది: 17-08-2026 మొదట సోమవారం తేది: 24-08-2026 రెండవ సోమవారం తేది: 31-08-2026 మూడవ సోమవారం ?: 07-09-2026 ? ? 2026 శ్రావణమాసం నాల్గవ సోమవారం తేది: 07-09-2026 శ్రీ స్వామి వారి పల్లకీ ఉత్సవము సాయంత్రం 5-00 గం॥ నుండి రాత్రి గం॥ 9-00 వరకు దేవస్థాన అధికారుల అర్చక సిబ్బంది దేవస్థాన చైర్మన్ ఽ పాలకమండలి సభ్యులు మరియు ఉరుకుంద గ్రామ ప్రజల ఆధ్వర్యములో అత్యంత వైభోవోపేతముగా నిర్వహించబడును. శ్రీ స్వామివారి సేవలో శ్రీ టి.జి.పాండురంగ శెట్టి చైర్మన్ మరియు పాలకమండలి సభ్యులు. భక్తులకు మనవి: శ్రావణ మాసములో శ్రీస్వామి వారిని విశేష వారములయందే కాకుండ శ్రావణమాసము నెల రోజులు విశేష దినములే, కావున భక్తులు, గ్రామ ప్రజలు అందరూ పాల్గొని శ్రీ స్వామి వారి సేవలో తరింతురుగాక" ? అందరూ ఆహ్వానితులే 5 శ్రీ స్వామివారి సేవలో 3. వీ.ాఫి, దీ.జు.ఽ., డిప్యూటి కమీషనర్ ఽ కార్య నిర్వహణాధికారి. దేవస్థాన అర్చకులు, కార్యాలయ సిబ్బంది.

## రైతుల పంటల బీమా క్లెయిమ్‌లను వెంటనే చేయించుకోవాలి




కౌతాళం, ప్రతినిధి జూలై 18: కౌతాళం సహకార సంఘం (పిఎసిఎస్)అధ్యక్షుడు ఏ. వెంకటపతి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2026 ఏప్రిల్ 1 నుంచి రైతులు పంట రుణాలు తీసుకున్నప్పటికీ, పీఎం ఎఫ్ బి వై (ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన) మరియు ఆర్ డబ్ల్యు బిసి ఐ ఎస్ పథకాల కింద పంటల బీమా అమలులో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన తెలిపారు.పంట రుణాలు పొందిన రైతుల వివరాలను సంబంధిత అధికారులు, బ్యాంకులు, సీఎస్‌సీ కేంద్రాల ద్వారా బీమా సంస్థలకు సకాలంలో పంపకపోవడం వల్ల రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కొంతమంది రైతుల నుంచి బీమా ప్రీమియం వసూలు చేసినప్పటికీ, బీమా నమోదు పూర్తికాకపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు.ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అర్హులైన రైతులందరికీ పంటల బీమా నమోదు పూర్తిచేసి, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఏ. వెంకటపతి డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బీమా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆయన కోరారు.

## ద్వారకాతిరుమల మండలంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు



ప్రతినిధి జూలై 18 గోపాలపురం నియోజకవర్గం ద్వారకతిరుమల మండలం జీ .కొత్తపల్లి గ్రామంలో స్వచ్ఛందర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో, ముఖ్య అతిథిగా పాల్గొన గోపాలపురం నియోజకవర్గం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు , ఈ సందర్భంగా, గ్రామ ప్రజలు నాయకులు అధికారులతో, స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు, రోడ్డు పక్కన చెత్తఎత్తి చెత్త సేకరణ రిక్షాలు వేశారు, పరిసరాలు పరిశుభ్రతతోనే, ప్రజలు



ఆరోగ్యంగా ఉంటారని, ఆయన కావున ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇల్లు గ్రామం, పరిశుభ్రంగా ఉంచటం ద్వారా ఆరోగ్యవంతంగా జీవిస్తారని ఆయన అన్నారు,ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ కూచిపూడి ఉదయ భాస్కర్ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, లంకా సత్యనారాయణ ,జీ .కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రేగంటి రాంబాబు గోపాలపురం నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు ఇమ్మడి రత్నాజీ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పాతూరి సహృదయ నియోజకవర్గ ఐటీడీపి అధ్యక్షులు కొత్తపల్లి భరత్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్ కుమార్ మండల ఐటీడీపి అధ్యక్షులు ఏపూరి కిషోర్ , నల్లజర్ల మండల ఐటీడీపి అధ్యక్షులు నాగ రఘు ,మండల పార్టీ నాయకులు మొగతడకల ఓం ప్రకాష్ ఘంటా నరసయ్య రేగంటి వెంకటేశ్వర రావు ఎంపీడీవో ప్రకాష్ వివిధ గ్రామాల నాయకులు ,స్థానిక అధికారులు,మహిళలు పాల్గొన్నారు

## జగన్ 2.0 యాప్ ని ఆవిష్కరించిన మాజీ మంత్రి తానేటి వనిత



గోపాలపురం నియోజకవర్గం ప్రతినిధి జులై 18 గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లి మండలం యర్నగూడెం వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయం నందు రాష్ట్ర మాజీహోంమంత్రి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ మెంబర్ గోపాలపురం నియోజకవర్గం ఇంచార్జ్ శ్రీమతి తానేటి వనిత ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి జగన్ 2.0 యాప్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది . ఈ కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గంలో గల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు . జగన్ 2.0 సూపర్ యాప్.. గ్రామస్థాయి కార్యకర్తలను రాష్ట్ర స్థాయి నాయకులతో అనుసంధానం చేస్తుంది . ఈ యాప్ లో కార్యకర్తలు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వేధింపులను షేర్ చేయొచ్చు అని తెలియజేశారు

## కాశీబుగ్గ ఘటనలో ఎస్సై వి ఆర్ కు బదిలీ.




శ్రీకాకుళం జిల్లా పలాస ఎస్సై బదిలీ: కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఎస్సై సునీల్‌ను వీఆర్ (వి ఆర్) కు పంపుతూ ఎస్పీ మహేశ్వర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.నేపథ్యం: మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి ప్రమాద ఘటన తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.మరికొందరిపై చర్యల అవకాశం: స్థానిక పోలీసులు అప్పలరాజుకు సహకరించారనే ఆరోపణలు వస్తుండటంతో, స్టేషన్‌లోని మరికొందరు సిబ్బందిపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయించిన ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు




శ్రీకాకుళం జిల్లా పలాస పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నేడు పురపాలక సంఘం ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం గా ఏర్పడి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీటీపీసీ చైర్మన్ ఉ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి శ్రీ వజ్జ




బాబూరావు గారు ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది మరియు పార్టీ నాయకులతో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా వజ్జ బాబూరావు గారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా భావించి పరిశుభ్రమైన పరిసరాల నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని, ప్రతి ఇంటి నుంచి స్వచ్ఛత ప్రారంభమైతేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.ప్రజలు తమ ఇళ్లు, వీధులు, కార్యాలయాలు మరియు ప్రజా ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు స్వచ్ఛమైన ఆంధ్రప్రదేశ్ లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది, జీడీ వ్యాపారులు సంఘం. మరియు స్థానిక ప్రజలు పాల్గొని స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం అనంతరం పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజా భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు.“పరిశుభ్రమైన పలాస -- అభివృద్ధి చెందిన పలాస, పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ -- స్వర్ణాంధ్రప్రదేశ్” లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వజ్జ బాబూరావు గారు పిలుపునిచ్చారు.

## గండిగుంట గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం -- ఎమ్మెల్యే శ్రీ బోడే ప్రసాద్ గారు...



పెనమలూరు నియోజకవర్గం, ఉయ్యూరు జులై 18 గండిగుంట గ్రామంలో సుమారు రూ.2 కోట్ల నిధులు తో నిర్మించే రోడ్లు,డ్రైనేజీల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చాం,ఇప్పటికే నరేగా నిధుల ద్వారా రూ.1.13 కోట్లతో పలు రోడ్ల అభివృద్ధి పనులు పూర్తి చేశాం,ఇప్పుడు మరో రూ.2 కోట్లతో పంచాయతీ నిధుల ద్వారా రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నాం,రాబోయే రోజుల్లో నరేగా నిధులను కూడా అధికంగా కేటాయించి, గ్రామంలో మిగిలిన మౌలిక సదుపాయాలన్నింటినీ పూర్తి చేస్తామన్నారు.గ్రామ ప్రజల చిరకాల కోరిక



అయిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌తో పాటు మరో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కూడా చర్యలు ప్రారంభించాం,సీఎస్ఆర్ నిధుల కింద ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాం,త్వరలోనే నిధులు మంజూరై ఆ పనులు కూడా ప్రారంభమవుతాయని ఆశిస్తున్నామన్నారు.గండిగుంట నాకు ఎంతో ఇష్టమైన గ్రామం, ఇక్కడి పచ్చదనం,ప్రజల ఆత్మీయత,అభివృద్ధి పట్ల వారి సహకారం ఎంతో అభినందనీయం, అన్ని గ్రామాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ,గండిగుంటలో చేపట్టిన పనులు పూర్తయిన తర్వాత ఈ గ్రామానికి అవసరమైన దాదాపు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి,గ్రామాన్ని అన్ని విధాలా ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు మా కృషి నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## 30క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం...



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు,పోలీస్ కమిషనర్ ఆదేశాలపై కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్,నార్కోటిక్ బృందాలు శనివారం ఉమా మహేశ్వరి కాలనీలో ఆకస్మిక దాడులు నిర్వహించాయి.ఈ దాడుల్లో సుమారు 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు1కోటి 35లక్షలు ఉంటుందని అంచనా వేశారు.ఈ ఘటనకు సంబంధించి సీతారాంపల్లి గ్రామానికి చెందిన బత్తుల సమ్మయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.అదుపులోకి తీసుకున్న నిందితుడిని స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యంతో పాటు తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ లో అప్పగించారు.

## ఎవ్వరికి అందనంత ఫలితాలలో డాక్టర్ మెడికల్ అకాడమీ



ఖమ్మం :లోకల్ గైడ్ :నీట్ -2026 ఫలితాలలో ఎప్పటి లాగానే ఈ సంవత్సరం కూడా డాక్టర్ మెడికల్ అకాడమీ పథకస్థాయి ఫలితాలను కైసవం చేసుకుంది, ఆల్ ఇండియా ర్యాంకు 237 సాధించడమే కాకుండా అంచనాల ప్రకారం122 మందిరికి గవర్నమెంట్ కోటాలో ఎంబిబిఎస్ సీట్లు సాధించే దిశగా అడుగులు వేస్తుంది, సాధారణ విద్యార్థులతో ఎటువంటి ఐఐటీ ఫౌండేషన్ లేని విద్యార్థులకు ఈ తరహా ఫలితాలు సాధింపజేయడం కేవలం డాక్టర్ మెడికల్ అకాడమీకే సాధ్యమని డైరెక్టర్ రాయల సతీష్ బాబు, ఈగ భరణి కుమారులు వ్యక్తం చేశారు, అకాడమీ విద్యార్థులు మార్కులు 50 పైనే నలుగురు 450 పైన 30 మందికి 400 పైన 107 మందికి మరియు గవర్నమెంట్ కోటాలో సీట్లు దాదాపుగా 122 మందికి వచ్చే అవకాశం తెలిపారు, రాహుల్ చైతన్య- 554, మీనాక్షి-531,, ప్రశాంత్-500, వైష్ణవి-500, ఇదే కాకుండా ఇంకా ఎంతోమందిని విద్యార్థులు అధిక మార్కులు సాధించారని చెప్పటం హర్షత రేఖంతో విద్యార్థులు మరియు అధ్యాపకులు యాజమాన్యం పండుగ జరుపుకున్నారు

## వ్యక్తిగత దూషణలు,తప్పుడు ప్రచారంపై కఠిన చర్యలు: కాశీబుగ్గ డీఎస్పీ టి.భవాని హెచ్చరిక..



శ్రీకాకుళం జిల్లా పలాస సోషల్ మీడియా వేదికలను ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వినియోగించాలని,ఎవరినీ వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని అవమానకరమైన పోస్టులు,అసత్య ప్రచారాలు చేయవద్దని కాశీబుగ్గ డీఎస్పీ టి.భవాని సూచించారు.సోషల్ మీడియాలో ఎవరిపైనైనా విమర్శలు చేయాల్సి వచ్చినప్పుడు అవి హుందాగా,గౌరవప్రదంగా ఉండాలని ఆమె తెలిపారు.వ్యక్తిగత దూషణలు,అసభ్యకర వ్యాఖ్యలు,అవమానకర పోస్టులు లేదా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు.సామాజిక మాధ్యమాల ద్వారా అసత్య ప్రచారం చేయడం, విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం,చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం వంటి చర్యలను పోలీసులు నిశితంగా గమనిస్తున్నారని డీఎస్పీ తెలిపారు.ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించే విధంగా వ్యవహరించినా,తప్పుడు ప్రచారం చేసినా లేదా సోషల్ మీడియాను దుర్వినియోగం చేసినా వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరించారు.ప్రజలు సోషల్ మీడియాను బాధ్యతతో వినియోగిస్తూ, సమాజంలో శాంతి,సామరస్యాలను పరిరక్షించేలా వ్యవహరించాలని ఆమె కోరారు.అలాగే,సందేహాస్పద పోస్టులను షేర్ చేసే ముందు వాటి నిజానిజాలను నిర్ధారించుకోవాలని సూచించారు.ఈ అవగాహన కార్యక్రమంలో పలాస రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తిరుపతిరావుమందస ఎస్ఐ కృష్ణ ప్రసాద్, వజ్రపుకొత్తూరు ఎస్ఐ నిహార్ తదితరులు పాల్గొన్నారు

## ఒకే రోజు 840 ఎకరాల ప్రభుత్వ భూమికి హైడ్రా రక్షణ

### రూ.30 వేల కోట్ల విలువైన భూమికి ఫెన్సింగ్.. మూడు జిల్లాల్లో భారీ ఆపరేషన్



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, లోకల్ గైడ్, జూలై 18: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ భూముల పరిరక్షణపై దృష్టి సారించిన నేపథ్యంలో హైడ్రా శనివారం నగర శివారు ప్రాంతాల్లో భారీ ఆపరేషన్ చేపట్టింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల్లో కలిపి మొత్తం 840 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి రక్షించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఈ భూముల విలువ సుమారు రూ.30 వేల కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.భారీ పోలీసు బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులతో కలిసి హైడ్రా బృందాలు ఈ చర్యలు చేపట్టాయి. తప్పుడు పత్రాలు, సర్వే నంబర్ల ఆధారంగా



ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు చేసిన ప్రయత్నాలను అడ్డుకుని భూములను స్వాధీనం చేసుకున్నాయి.రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో సర్వే నంబర్లు 25, 26లో ఉన్న 650 ఎకరాల ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అలాగే శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలో సర్వే నంబర్ 46లోని 84 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని రక్షణ చర్యలు చేపట్టారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో జీఎల్ఆర్ నంబర్లు 243, 255లోని 106 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమణల నుంచి విముక్తం చేసి ఫెన్సింగ్ వేశారు.రాయదుర్గంలో ప్రైవేటు పట్టా భూమి పేరుతో ప్రభుత్వ భూమిలోకి చొరబడి ఆక్రమణలు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఐటీ కారిడార్‌కు సమీపంలో ఉన్న ఈ విలువైన భూమిలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తేలడంతో హైడ్రా వెంటనే జోక్యం చేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది.కంటోన్మెంట్ ప్రాంతంలో ప్రభుత్వ భూముల్లో అక్రమ లేఅవుట్లు వేసి ప్లాట్లుగా విక్రయించే ప్రయత్నాలను అడ్డుకున్నారు. కొండలను పేల్చడం వల్ల పర్యావరణం, వన్యప్రాణులకు ముప్పు ఏర్పడిందని స్థానికుల ఫిర్యాదుల మేరకు ప్రహరీలను తొలగించి భూమిని రక్షించారు. ఈ చర్యలను స్థానికులు స్వాగతిస్తూ హైడ్రాకు మద్దతుగా ర్యాలీలు నిర్వహించారు.శంషాబాద్ బహదూర్‌గూడలో 1954 ఖాస్రా పహాణీ ప్రకారం ప్రభుత్వ భూమిగా నమోదైన 650 ఎకరాలపై గతంలో క్రమబద్ధీకరణ ప్రతిపాదనలు వచ్చినప్పటికీ ప్రభుత్వం తిరస్కరించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆ భూముల్లో ఉన్న ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన...



బెల్లంపల్లి (లోకల్ గైడ్)మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని బుధకుర్ధు గ్రామంలోఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా పడుతున్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని బెల్లంపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి చొప్పదండి తిరుపతి సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు బెల్లంపల్లి క్లస్టర్ లోని చాకెపల్లి,చంద్రవెల్లి,అంకుశం,కన్నాల,బూధకలాన్ గ్రామాల శివారులో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై గత వారం రోజుల నుండి రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.వర్షాభావ పరిస్థితులు దృష్ట్యా రైతులు ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని అన్నారు.మినుములు,పెసర,కంది,కూరగాయలు,జొన్న,రాగులు వంటి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు.వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటలను మార్పు చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చన్నారు.పంట వైవిధ్యం వల్ల రైతుల ఆదాయం పెరగడంతో పాటు భూసారాన్ని కూడా కాపాడుకోవచ్చని రైతులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో బుధకుర్ద్ సర్పంచ్ ఎంబడి రాణి,నాయకులు సురేష్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పెదవేగి పోలీస్ సెంటర్ విషాద ఛాయలు అలముకున్నాయి



ఏలూరు జిల్లా ,పెదవేగి ,జులై ఎదవేగి పోలీసు సెంటర్ విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్ వి ప్రసాద రెడ్డి 568 విధి నిర్వహణ ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవ్వడం పట్ల ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ తీవ్ర దిగ్భ్రాంతిని, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్‌కు నివాళులు బాధిత కుటుంబానికి అండగా ఏలూరు పోలీసులు.విధి నిర్వహణ నుండి స్వగృహానికి వెళ్తున్న సమయంలో జరిగిన దురదృష్టకర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ మృతి పోలీసు శాఖకు తీరని లోటు. ఈ విషాద సమయంలో వారి కుటుంబానికి అండగా నిలిచేందుకు ఏలూరు జిల్లా పోలీసు యంత్రాంగం.ఏలూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ఏలూరు అదనపు ఎస్పీ అడ్మిన్ శ్రీ వై. ప్రసాద్ రావు , ఎస్.బి. ఇన్స్పెక్టర్ శ్రీ మల్లేశ్వర రావు మరియు పెదవేగి పోలీస్ ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది మృతి చెందిన కానిస్టేబుల్ భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కుటుంబానికి భరోసా మరియు సహాయం బాధిత కుటుంబానికి అదనపు ఎస్పీ అడ్మిన్ శ్రీ వై. ప్రసాద్ రావు ఆర్థిక సహాయం ఫ్యూనరల్ ఛార్జ్ 25,000/- ఫ్లాగ్ ఫండ్ 25,000/- విడో ఫండ్ 50,000/- చెక్కులను అంద చేసినారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న కానిస్టేబుల్ భౌతికంగా దూరమైనా, ఏలూరు జిల్లా పోలీస్ యంత్రాంగం మొత్తం వారి కుటుంబానికి అండగా ఉంటుందని అధికారులు హామీ ఇచ్చారు. జిల్లా ఎస్పీ సందేశాన్ని తెలియ చేస్తూ, మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి ప్రభుత్వం తరపున రావాల్సిన అన్ని రకాల సదుపాయాలు మరియు ప్రయోజనాలు త్వరితగతిన అందేలా జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ స్వయంగా చొరవ తీసుకుని చర్యలు కొరకు భరోసా ఇచ్చారు.పోలీసు కుటుంబం అంటే ఒకరి కష్టంలో మరొకరు పాలుపంచుకునే గొప్ప వ్యవస్థ అని, ఈ విషాద సమయంలో పోలీసు శాఖ యావత్తు బాధిత కుటుంబానికి తోడుగా ఉంటుందని జిల్లా అధికారులు పునరుద్ఘాటించారు.లిమరణించిన కానిస్టేబుల్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ కష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నాము అని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ తెలియ చేసినారు.ఈ కార్యక్రమములో ఎస్ బి ఇన్స్పెక్టర్ శ్రీ మల్లేశ్వర రావు పెదవేగి పోలీస్ ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది ఏలూరు జిల్లా పోలీస్ అధికారులు సంఘం అధ్యక్షుడు ఆర్ నాగేశ్వరరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ అధికారులకు ఘన సన్మానం -- భావోద్వేగ వీడ్కోలు



చర్ల : లోకల్ గైడ్ :మిషన్ భగీరథ భద్రాచలం సబ్‌డివిజన్‌లో విశిష్ట సేవలందించి బదిలీపై వెళు్తన్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) పీ ఏసుబాబు మరియు ఇంట్రా ఏఈ వీ రాములకు చర్ల రైతు వేదికలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చర్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం మాట్లాడుతూ, డీఈఈ ఏసుబాబు అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజలకు నాణ్యమైన తాగునీటి సరఫరా అందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. సన్మానానికి స్పందించిన డీఈఈ పీ. ఏసుబాబు మాట్లాడుతూ, మిషన్ భగీరథ సిబ్బంది తనకు కుటుంబ సభ్యుల్లాంటి వారని అన్నారు. అందరూ అంకితభావంతో పనిచేశారని, ఉద్యోగ జీవితంలో జరిగే చిన్నచిన్న పొరపాట్లను సరిదిద్దుకుంటూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. సిబ్బంది భవిష్యత్తులో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇంట్రా ఏఈ వీ రాము మాట్లాడుతూ, చర్లలో పనిచేసిన కాలం తన జీవితంలో మరపురాని అనుభూతిగా నిలిచిపోతుందని తెలిపారు. సహోద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అందించిన సహకారానికి కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఏఈ ఎం. అరుణ్ కుమార్, ఇంట్రా డీఈఈ రవితేజ, ఇంట్రా ఏఈలు ఉపేందర్ (దుమ్ముగూడెం), నారాయణరావు (భద్రాచలం), ఇరిగేషన్ ఏఈ సంపత్, ఎంపీఓ మూర్తి (చర్ల), చర్ల ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, సీనియర్ నాయకుడు కాపుల నాగరాజు, మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు, కార్యదర్శులు, మిషన్ భగీరథ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బదిలీపై వెళ్తున్న అధికారులకు ఘనంగా వీడ్కోలు పలికిన ప్రజాప్రతినిధులు, సిబ్బంది వారి భవిష్యత్ సేవలకు శుభాకాంక్షలు తెలిపారు.

## రైతుల అక్రమ అరెస్టులకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి నిరసన. నందిగామ పోలీస్ స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ ఆందోళన.

రంగారెడ్డి జిల్లా బ్యూరో, ( లోకల్ గైడ్ ): శంషాబాద్ మండలం బహుదూర్ గూడ లో రైల్వే కోచ్ కోసం పేద రైతుల భూములను ప్రభుత్వం అమానుషంగా లాక్కోవడానికి వ్యతిరేకంగా రైతుల ఆందోళనలకు మద్దతు ఇస్తే ఈ ప్రభుత్వం పోలీసులచే అరెస్ట్ చేయించడం అప్రజాస్వామ్యమని బి ఆర్ ఎస్ రాజేంద్ర నగర్ నియోజకవర్గం ఇంచార్జి పి. కార్తీక్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఏ ఒక్క మంచి పనిచేసిందా ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి అధికారం లోకి వచ్చాక పేదల ఇళ్ళు కూల్చడం, రైతుల భూములను లాక్కోవడం తప్ప మరేమి లేదని మండిపడ్డారు. బహుదూర్ గూడలో రైతులకు మద్దతు తెలిపేందుకు వెళుతుంటే అక్రమంగా అరెస్ట్ చేసి నందిగామ పోలీస్ స్టేషన్ కు తీసుకురావడం ఏమిటని, ఇది అత్యంత దారుణమన్నారు. కార్తీక్ రెడ్డి, బి ఆర్ నాయకులు అరెస్ట్ కు నిరసనగా నందిగామ పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్. నవీన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. రైతుల తరఫున పోరాటం చేస్తున్న రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డిని, అలాగే భూముల సమస్యపై ఆందోళన చేస్తున్న రైతులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిపై కేసులు నమోదు చేసి అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. రైతుల హక్కుల కోసం పోరాడుతున్న నాయకులను అణచివేయాలని ప్రయత్నించడం సరైన విధానం కాదని అన్నారు.రైతులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేసి, అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## వాలీబాల్ అకాడమీలో ప్రవేశాలకై రాష్ట్ర స్థాయి ఎంపికలు.

వాలీబాల్ అకాడమీ, సరూర్ నగర్

సరూర్ నగర్, తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ అకాడమీ, సరూర్ నగర్ (రంగారెడ్డి జిల్లా) లో ప్రవేశాల కోసం 14 నుంచి 18 ఏళ్ల వయస్సు గల తెలంగాణ రాష్ట్ర, స్థానిక బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా యువజన, క్రీడల అధికారిని స్వర్ణలత తెలిపారు. అభ్యర్థుల శారీరక సామర్థ్యం, ఎత్తు, క్రీడా నైపుణ్యాన్ని పరీక్షించి రాష్ట్ర స్థాయిలో ఎంపికలు నిర్వహించబడతాయని ఆమె తెలిపారు. ఈ నెల 20, 21వ తేదీల్లో ఉదయం 8.00 గంటలకు సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం, ఎల్.బి. నగర్, నిర్వహించబడతాయన్నారు.

**వాలీబాల్ క్రీడాకారుల అర్హతలు:**

1. అభ్యర్థులు జూన్ 30వ తేదీ 2008 నుంచి జులై 1 2012 మధ్య జన్మించి ఉండాలి. 2. 1 4 నుండి 16 సంవత్సరాల వయస్సు గల శీ బాలురు -- 180 సెం.మీ. లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు బాలికలు -- 170 సెం.మీ. లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు 3.16 నుండి 18 సంవత్సరాల వయస్సు గల బాలురు -- 185 సెం.మీ. లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు బాలికలు -- 175 సెం.మీ. లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు తప్పనిసరిగా తీసుకురావలసిన ధ్రువపత్రాలు:1.జనన ధ్రువీకరణ పత్రం ( ఒరిజినల్, జిరాక్స్ ) 2. ఆధార్ కార్డు 3. విద్యార్హతల ధ్రువపత్రాలు ( ఒరిజినల్ జిరాక్స్ ) 4. క్రీడా విజయాల ధ్రువపత్రాలు ( ఒరిజినల్ జిరాక్స్)5. పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు -- 5

**ముఖ్య సూచనలు:**

వాలీబాల్ అకాడమీ, సరూర్ నగర్‌లో ప్రవేశాల కోసం అర్హులైన క్రీడాకారులు తమ అసలు ధ్రువపత్రాలు మరియు జిరాక్స్ ప్రతులతో పాటు టీ-షర్ట్, నిక్కర్, స్పోర్ట్స్ షూస్ ధరించి ఈనెల 20 21వ తేదీల్లో ఉదయం 8 గంటలకు జిల్లా యోజన, క్రీడల శాఖ కార్యాలయంలో హాజరు కావాలన్నారు. ఇతర వివరాల కోసం సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు:9848364143 / 9000992041 ఎంపికైన క్రీడాకారులకు ఉచిత శిక్షణ, వసతి, భోజన సదుపాయం కల్పించబడును.

## వర్గల్ నవోదయలో ఘనంగా ముగిసిన క్లస్టర్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన-2026

61 వైజ్ఞానిక నమూనాలతో ఆకట్టుకున్న నవోదయ క్లస్టర్ సైన్స్ ప్రదర్శన



సిద్దిపేట జులై 18:సిద్దిపేట జిల్లా వర్గల్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన క్లస్టర్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన--2026 శనివారం ఘనంగా ముగిసింది. ఈ విషయాన్ని విద్యాలయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. తెలంగాణలోని ఆసిఫాబాద్, కరీంనగర్, నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి, సిద్దిపేట,



నిజామాబాద్, నాగర్‌కర్నూల్, వరంగల్ జిల్లాలకు చెందిన తొమ్మిది జవహర్ నవోదయ విద్యాలయాల విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.సుస్థిర వ్యవసాయం, వ్యర్థాల నిర్వహణ--ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలు, హరిత శక్తి, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, వినోదాత్మక గణిత నమూనాలు, ఆరోగ్యం--పరిశుభ్రత, నీటి సంరక్షణ వంటి అంశాలపై మొత్తం 61 వైజ్ఞానిక నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. అలాగే ప్లాస్టిక్ కాలుష్య నివారణపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు.ముగింపు కార్యక్రమంలో వివిధ విభాగాల్లో తొలి, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ దాసి రాజేందర్, ఉప ప్రధానాచార్యులు మోహన్ రాథోర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి ప్రిన్సిపాల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరా లో అంతరాయం.. . రవికుమార్, విద్యుత్ శాఖ,ఏఈ,



కొందుర్గ్. మండలంన్యూస్ 18 కొందుర్గ్..కొందుర్గ్ మండలంలోని ఉత్తరాస్పల్లి, చిన్న ఎల్కిచెర్ల సబ్ స్టేషన్ ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం అనగా తేదీ 19 ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుంది. రెండు సబ్ స్టేషన్ ల లో విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించడంలి జరుగుతుంది. అలాగే సాంకేతిక సమస్యలను పరిష్కరించడం జరుగుతుంది. అందువల్ల రెండు సబ్ స్టేషన్ ల పరిధిలోని ఉత్తరాస్పల్లి, టేకులపల్లి, మూట్ పూర్ , రేగడి చిల్కమర్రి, బైరంపల్లి, మహదేవ్ పూర్, రామచంద్ర పూర్, శ్రీరంగాపూర్, చిన్న ఎల్కిచెర్ల,పర్వతాపూర్, అయ్యవారిపల్లి, అయోధ్య పూర్ తండా లలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుంది. ఆయా గ్రామాల ప్రజలు సహరించగలరు. అని విద్యుత శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రతి కేసులో శిక్షల శాతం పెంపులో పోలీసు--ప్రాసిక్యూషన్ సమన్వయం కీలకం

పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు కానిస్టేబుళ్లతో సమన్వయ సమావేశం ..




నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి ..జిల్లాలో నమోదవుతున్న క్రిమినల్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా దర్యాప్తు నుంచి కోర్టు విచారణ వరకు ప్రతి దశలో పోలీసు శాఖ--ప్రాసిక్యూషన్ శాఖ సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు కానిస్టేబుళ్లతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో మాట్లాడారు.జిల్లాలో నమోదవుతున్న పోస్కో ఎస్ సి/ఎస్ టి అట్రాసిటీస్, ఎన్ డి పి ఎస్ , హత్య, దోపిడీ వంటి తీవ్రమైన కేసుల్లో దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచాలని, ప్రతి కేసులో బలమైన సాక్ష్యాధారాలను సేకరించి చట్టపరమైన అన్ని ప్రక్రియలను పకడ్బందీగా పూర్తి చేయాలని ఎస్పీ ఆదేశించారు. నాణ్యమైన దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, చట్టపరమైన నిబంధనల అమలుతోనే శిక్షల శాతాన్ని పెంచడం సాధ్యమవుతుందని తెలిపారు.సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కోర్టు విచారణల సందర్భంగా ఎదురవుతున్న సమస్యలను పోలీసు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. చార్జ్‌షీట్ల తయారీ, కేసు డైరీలు , ఫోరెన్సిక్ నివేదికలు, వైద్య నివేదికలు, సాక్షుల వాంగ్మూలాలు, డిజిటల్ సాక్ష్యాలు తదితర కీలక పత్రాలను పూర్తి స్థాయిలో కోర్టుకు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.దర్యాప్తు అధికారులు ప్రతి కేసులో అవసరమైన అన్ని ఆధారాలను చట్టబద్ధంగా సేకరించి, ఎలాంటి లోపాలు లేకుండా కేసు డైరీలను సిద్ధం చేయాలని ఎస్పీ ఆదేశించారు. కోర్టు విచారణకు ముందు ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి, గుర్తించిన లోపాలను సకాలంలో సరిదిద్దడం ద్వారా కేసును మరింత బలపరచవచ్చని తెలిపారు.కోర్టులో సాక్ష్యం చెప్పే సాక్షులను ముందుగానే సంప్రదించి, విచారణ తేదీలపై, అవగాహన కల్పించి, నిర్ణీత సమయానికి కోర్టుకు హాజరయ్యేలా చూడటం కోర్టు కానిస్టేబుళ్ల ముఖ్య బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు. సాక్షులు గైర్హాజరు కావడం లేదా ఆలస్యంగా హాజరుకావడం వల్ల విచారణలు వాయిదా పడుతున్నాయని, ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కేసు విచారణతో పాటు బాధితులకు ప్రభుత్వం ద్వారా అందే పరిహారంపై కూడా అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా పోక్సో , ఎస్సీ/ఎస్టీ అఘాయిత్యాల నిరోధక చట్టం మరియు ఇతర అర్హత కలిగిన కేసుల్లో నిందితులకు శిక్ష పడిన అనంతరం ప్రభుత్వం నుంచి అందే పరిహారం గురించి బాధితులకు స్పష్టమైన అవగాహనా కల్పిచాలని అన్నారు.ప్రాసిక్యూషన్ అధికారులు కేసుల్లో గుర్తించిన లోపాలను వెంటనే దర్యాప్తు అధికారులకు తెలియజేసి, వాటిని సకాలంలో సరిదిద్దేలా పరస్పర



సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రతి కేసును బలమైన సాక్ష్యాధారాలతో సమర్థవంతంగా కోర్టులో ప్రవేశపెడితేనే నిందితులకు శిక్షలు విధించబడతాయని, తద్వారా ప్రజల్లో పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్ శాఖ, న్యాయవ్యవస్థపై విశ్వాసం మరింత పెరుగుతుందని ఎస్పీ పేర్కొన్నారు.ఇలాంటి సమీక్ష సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, కేసుల పురోగతి, లోపాలు, పరిష్కార మార్గాలపై చర్చించి జిల్లాలో శిక్షల శాతాన్ని మరింత పెంచేందుకు పోలీసు--ప్రాసిక్యూషన్ శాఖలు ఉమ్మడిగా కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమేష్, డీఎస్పీలు శివరాం రెడ్డి, రవి, శ్రీనివాస్ రావు, డిసిఆర్బి సీఐ శ్రీను నాయక్,సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శ్రీవాణి, అఖిల, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ భూష్మి శ్రీకాంత్ నేర సామ్రాజ్యం బట్టబయలు

యువకులను మభ్యపెట్టి నేరాల వైపు మళ్లించి,శిక్షణ ఇచ్చిన కరుడుగట్టిన నేరస్థుడు.

విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి.

భూష్మి శ్రీకాంత్ ఏర్పాటు చేసిన 8 మంది అంతర్‌రాష్ట్ర చోరీ ముఠాలో 6 మంది అరెస్ట్ -- ఇద్దరు పరారీలో.

రెండు తెలుగు రాష్ట్రాల్లో 40 చోరీ కేసుల ఛేదన -- పట్టుబడిన నేరస్థుల నుండి 53 లక్షల విలువ చేసే 260 గ్రాముల బంగారు ఆభరణాలు, 5 ఖిస్త్రల వెండి ఆభరణాలు మరియు 1,50,000/- నగదు,రెండు టీవీలు,రెండు సౌండ్ బార్స్, 5 ద్విచక్ర వాహనాలు మరియు (7) మొబైల్ ఫోన్లు స్వాధీనం.

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ..




నల్లగొండ ఉమ్మడి జిల్లా .రెండు తెలుగు రాష్ట్రాల్లో తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్‌గా మారిన మోస్ట్ వాంటెడ్ అంతర్‌రాష్ట్ర నేరస్థుడు భూష్మి శ్రీకాంత్ అలియాస్ అమ్మిరాజు రూపొందించిన నేర ముఠాను నల్గొండ జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ ముఠాలోని ఆరుగురు సభ్యులను అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. నిందితుల వద్ద నుంచి భారీ మొత్తంలో బంగారం, వెండి ఆభరణాలు, నగదు, రెండు టీవీలు ,రెండు సౌండ్ బార్స్,ఐదు ద్విచక్ర వాహనాలు, (7)మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, వెల్లడించారు.ఇటీవల అరెస్టైన మోస్ట్ వాంటెడ్ నేరస్థుడు భూష్మి శ్రీకాంత్‌ను విచారించగా అతని నేర కార్యకలాపాలకు సంబంధించిన అనేక సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. శ్రీకాంత్ ఇచ్చిన సమాచారం ఆధారంగా తెలంగాణ, 28 ఆంధ్రప్రదేశ్ 12 మొత్తం 40 చోరీ కేసులకు పాల్పడిన అతని ముఠాను పట్టుకునేందుకు,జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. జితేందర్ రెడ్డి, డి చంద్రశేకర్ రెడ్డి, మిర్యాలగూడ రూరల్ సిఐ పి ఎన్ డి




ప్రసాద్,మిర్యాలగూడ ×× టౌన్ ాా× ఆంజనేయులు, మాడ్గులపల్లి ాా× సురేశ్ యాదవ్ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో,తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తృతంగా గాలింపు నిర్వహించారు. నిరంతర నిఘా, కచ్చితమైన సమాచార సేకరణ ఫలితంగా ముఠాలోని ఆరుగురు సభ్యులనుపిడుగురాళ్ల, అంజనీపురం, మండేపూడి(జ) అమరావతి లలో ఈ రోజు ఉదయం సుమారు 9.00 గంటలకు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా పలు చోరీ కేసులు వెలుగులోకి వచ్చాయి.

**యువకులను మభ్యపెట్టి నేరాల వైపు నడిపించిన శ్రీకాంత్:**

దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాలు మరింత సంచలనంగా ఉన్నాయి భూష్మి శ్రీకాంత్ విజయవాడ, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నల్గొండ తదితర ప్రాంతాల్లో తలదాచుకుంటూ వైన్ షాపుల వద్ద పరిచయమైన యువకులను లక్ష్యంగా చేసుకునేవాడు.మొదట వారికి మద్యం తాగించడం, డబ్బులు ఖర్చు పెట్టడం, వ్యక్తిగత సమస్యలు తెలుసుకుని సహాయం చేస్తున్నట్లు నమ్మకం కల్పించడం ద్వారా వారిని తనకు దగ్గర చేసుకునేవాడని విచారణలో తేలిందన్నారు.అనంతరం "తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించే మార్గం చోరీలే" అంటూ ప్రలోభపెట్టి నేరాల వైపు మళ్లించేవాడన్నారు.అంతేకాకుండా తాళాలు ఎలా పగులగొట్టాలి, ఎలాంటి ఇళ్లను లక్ష్యంగా ఎంచుకోవాలి, రాత్రి వేళల్లో ఎలా చోరీ చేయాలి, పోలీసుల కదలికలను ఎలా గమనించాలి, సీసీటీవీ కెమెరాలను ఎలా తప్పించుకోవాలి, చోరీ చేసిన బంగారం, వెండిని ఎక్కడ విక్రయించాలి వంటి అంశాలపై కూడా తన అనుచరులకు శిక్షణ ఇచ్చినట్లు విచారణలో వెల్లడైందన్నారు.ఇలా మొత్తం తొమ్మిది మంది సభ్యులతో శ్రీకాంత్ ఈ ముఠాను ఏర్పాటు చేసినట్లు గుర్తించడం జరిగింది. వీరిలో తమ్మిశెట్టి నాగరాజు మినహా మిగిలిన యువకులకు గతంలో ఎలాంటి నేరచరిత్ర లేదని తెలిపారు. నిందితుడు (ఆ -3) నాగరాజు పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో గతంలో 10 కి పైగా కేసులు కలవు మరియు ఒక డెకాయిటీ కేసు లో ఇతనికి 7 సంవత్సరాల జైలు శిక్ష కూడా పడినది. ఇట్టి శిక్ష కాలం లో ఇతనికి రాజమండ్రి సెంట్రల్ జైల్ లో భూష్మి శ్రీకాంత్ తో పరిచయం యేర్పడినది. శిక్ష పడిన ఇతని ప్రవర్తనలో మార్పురాకపోగా, కరుడు గట్టిన నేరస్థుడు బుష్మి శ్రీకాంత్ ఏ అమ్మిరాజు తో జత కట్టి, భూష్మి శ్రీకాంత్ కు ఆశ్రయం కల్పించి అతని తో కలిసి నేరాలకు పాల్పడినాడు అని విచారణలో తేలినది.ఈ ముఠా సభ్యులు ప్రధానంగా తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా ఎంచుకుని రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడేవారని, రెండు తెలుగు రాష్ట్రాల్లో 40 కేసుల్లో వీరి ప్రమేయం ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. నల్గొండ జిల్లా పోలీసుల నిఘా, సాంకేతిక విశ్లేషణ, ప్రతి చిన్న ఆధారాన్ని కీలక సమాచారంగా మలిచి నిరంతర దర్యాప్తు ఫలితంగా ఈ నేర ముఠానుప్రారంభ దశలోనే గుర్తించి చట్టం ముందు నిలబ...

## నల్గొండ నగర పాలికకు నూతన కమిషనర్ గా వంశీకృష్ణ నియామకం.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.వెయిటింగ్ ఫర్ పోస్టింగ్‌లో ఉన్న స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ బి. వంశీ కృష్ణను నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది...త్వరలో వంశీ కృష్ణ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించనున్నారు.నగర అభివృద్ధి, పారిశు ద్ధ్యం, పౌర సేవలపై ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉంది.కొత్త కమిషనర్ రాకతో పెండింగ్ అభివృద్ధి పనులకు వేగం పెరుగుతుందనే నగర ప్రజలు ఆశాభవం వ్యక్తం చేస్తున్నారు...

## విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలే బలమైన పునాది.

కస్తూరిబా పాఠశాలలో విద్యార్థినులకు దుస్తుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి.



ఆమనగల్లు, జూలై 18 ప్రభుత్వ పాఠశాలలను విద్యా ప్రమాణాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.శనివారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో నిర్వహించిన ఉచిత దుస్తుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన విద్యార్థినులకు దుస్తులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం కార్పొరేట్ స్థాయిలో విద్య అందిస్తున్నామని, ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకొని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సమాజ అభివృద్ధికి విద్యే ప్రధాన ఆయుధమ ని, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకు ని ముందుకు సాగాలని ఆకాంక్షించారు.విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ , యూనిఫారా లు, మధ్యాహ్న భోజనం వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాటా గీతా నరసింహ, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, మండల విద్యాధికారి పాండు, టీపీసీసీ సభ్యుడు అయ్యేల శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## త్రివేణి పాఠశాలలో ఘనంగా గ్రీన్ కలర్ డే



ఖమ్మం ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాల ప్రీ-ప్రైమరీ విభాగంలో "గ్రీన్ కలర్ డే" వేడుకలను " అనే థీమ్‌తో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఆకుపచ్చ రంగు దుస్తులు ధరించి మొక్కలు నాటడం, ప్రకృతి అంశాలపై ప్రదర్శనలు, పాటలు, నృత్యాలతో ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ డా.గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచే పిల్లల్లో ప్రకృతి ప్రేమ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించాలని అన్నారు.అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, గ్రీన్ కలర్ డే వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో రంగుల పరిజ్ఞానంతో పాటు ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా,సిఆర్‌ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ,క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్ ఉపాధ్యాయినీ -ఉపాధ్యాయులు మరియు విద్యార్థినీ-విద్యార్థులు పాల్గొన్నారు.

## వంగూరి వాచకం- నవరత్నాలు

1. గెలిస్తే అనుకుంటామా
నేనే ఎందుకు గెలిచాను
అని
ఓడిపోతే మాత్రం
సవాలక్ష కారణాలు చూపే
పని.

2.వరాల కోసం
ఆరాధన
బేరాలు మనకు
ఔపోసన.

3.హైదరాబాదులో
హైరైజ్ బిల్డింగులు
వేయాలేమో మరి
హైరైజ్ రోడ్డులు.

4.భలే ఆదర్శం
గురివింద
మహా దురద
పరనింద.

5.నమ్మకపోతే
ద్వేషం
నమ్మితే
మోసం.

6.ప్రతి తల్లి
ఒక గాయని
ఆమె పాటేగా
పాపకు తీయన.

7.ఒడలకు
బడలిక
కుశలతకు
ప్రణాళిక.

8.నీవు నవ్వినా ఏడ్చినా
వచ్చేది కంటనీరు
నన్ను నాటినా పూడ్చినా
ఇచ్చేది పంట చేను.

9.చిన్నది అని వదిలితే
తెచ్చేను చూడు పెద్ద
ముప్పు
చిన్న దోమ కుట్టినా
వచ్చేను కదా పెద్ద జబ్బు.

వంగూరి గంగిరెడ్డి
9652286270
షాద్ నగర్



# కొత్తూరులో యువ సంగ్రామ సదస్సుకు తరలిన గులాబీ శ్రేణులు

వై జంక్షన్ లో తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసిన బిఆర్ఎస్ శ్రేణులు

ఉద్యోగాలు ఇస్తామని మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వానికి చురకలు

బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కడాల శ్రీశైలం






కొత్తూర్ జులై 18 )ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కు తగిన బుద్ధి చెబుతామని బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కడల శ్రీశైలం హెచ్చరించారు. శనివారం హైదరాబాద్ సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ యువ సంగ్రామ సదస్సుకు టిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కడల శ్రీశైలం ఆధ్వర్యంలో కొత్తూరు లో తెలుగు తల్లి విగ్రహానికి గులాబీ శ్రేణులు పూలమాలలు వేసి వెళ్లారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు కడాల శ్రీశైలం మాట్లాడుతూ..ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ముఖ్యంగా యువతకు తీవ్ర అన్యాయం జరిగే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని, ఉద్యోగాలు, ఉపాధి వనరులు చూపకుండా తెలంగాణ యువతను మోసం చేసిందని మండిపడ్డారు. హామీలు నెరవేర్చే వరకు ప్రజల పక్షాన ప్రభుత్వ నిలదీస్తూనే ఉంటామని, రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి మరో మారు కేసీఆర్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు పెంటనోళ్ళ యాదగిరి, మాజీ ఎంపిటిసి వద్దే బాలయ్య, బిఆర్ఎస్ పార్టీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు దేశాల జైపాల్,బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మామిడి దామోదర్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేశాల భీమయ్య,బి రాజు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలిమినేడు గ్రామంలోభూములు కోల్పోయిన రైతులకి ప్లాట్లు మంజూరు

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కి ధన్యవాదాలు తెలిపిన రైతులు



ఇబ్రహీంపట్నం జూలై18 ఇబ్రహీంపట్నం మండల్ ఎలిమినేడు గ్రామంలో గత ప్రభుత్వంలో భూములు కోల్పోయిన రైతులకి ప్లాట్లు మంజూరు చేయించిన సందర్భంగా గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ని కలిసి ధన్యవాదాలు తెలిపిన రైతులు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో రైతులకి ఇస్తున్న ప్లాట్లు నిజమైన రైతులకి చెందేలా చూడాలని అధికారులని ఆదేశించారు.పట్టా భూములు కి ఎన్ ఓ సి ఇచ్చి భూములకు వెళ్లడానికి దారిని ఇవ్వాలని, అధికారులకు తెలియజేశారు.గ్రామ అవసరాలకి కొంత భూమిని గ్రామానికి కేటాయించాలని గ్రామ రైతులు కోరడం జరిగింది.గ్రామ ప్రజల అభిప్రాయం మేరకు ఎలిమినేడు లో చేసే హెచ్ఎండిఏ లేఔట్ ని ప్రజలకి అణువుగా ఉండే ప్రదేశంలో చేయాలని ప్రజలు కోరడం జరిగింది. కార్యక్రమంలో మంకాల శేఖర్ రెడ్డి,పట్నం బీరప్ప,పసుల గోపాల్,బుట్టి బుషన్,అరిగే జంగయ్య,ఏకే మహేందర్,పిట్టల యాదగిరిపట్నం శివశంకర్,జంగయ్య,కృష్ణుడు,శేఖర్,రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడితే ఉన్నత స్థాయికి ఎదగవచ్చు స్నేహ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామేశ్వరరెడ్డి



నారాయణపేట జూలై 18ప్రతి విద్యార్థి తన కలలను నిజం చేసుకునే శక్తి కృషిలోనే ఉందనీ కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అందుకోవచ్చని స్నేహ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామేశ్వర్ రెడ్డి అన్నారు.శనివారం పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కున్సిలో నిర్వహించిన విద్యార్థులకు నోటుబుక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొనీ దాదాపు 2,000కు పైగా నోటుబుక్కులను విద్యా ర్థులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రెండు కోళ్లతో ప్రారంభమైన మా ప్రయాణం నేడు రోజుకు ఐదు లక్షల కోళ్ల ఉత్పత్తి చేసి, ఎనిమిది దేశాలకు చికెన్‌ను ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందనారు. అయితే కోట్ల రూపాయలు సంపాదించడం కంటే, మా నోటుబుక్కులు అందుకున్న విద్యార్థులు ఉన్నత స్థాయి కి చేరుకున్నపుడు కలిగే ఆనందమే మాకు ఎంతో గొప్పదన్నారు.విద్యార్థులకు చేయూతనివ్వడం మా అదృష్టంగాభావిస్తున్నామని తెలిపారు .ఇలాంటి సేవా కార్యక్రమాలకు మేము ఎల్లప్పుడూ ముందుంటాం అని పేర్కొన్నారు.ఈ కార్య క్రమంలో గ్రామ సర్పంచ్ ఎం. సురేష్ , ఉపసర్పంచ్ యు. రమేష్ , పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యా యులు పి. నరేందర్ , గ్రామ పెద్దలు సోమశేఖర్ గౌడ్ , రామచందర్ మాస్టర్ , నల్లె నర్సప్ప, ఎండి అన్వర్, పల్లె సురేష్ గారు, మేకల మహదేవ్, ఉప్పరి హనుమంతు, మేకల భీమ్ , వార్డు సభ్యులు రాము , పంచాయతీ సెక్రటరీ స్వామినాథ్, విజయ్ కుమార్ గౌడ్, శరణ్ గౌడ్ , వార్డు సభ్యులు, తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీహరి త్వరగా కోలుకోవాలని శ్రీ లక్ష్మి నర్సింహా స్వామి ఆలయం లో ప్రత్యేక పూజలు



నారాయణ పేట జులై 18:(: తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ , యువజన క్రీడలు, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి త్వరగా కోలుకోవాలని మాగనూర్ మండల కేంద్రంలో నీ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం లో కాంగ్రెస్ శ్రేణులు,అభిమానులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.అస్వస్థతతో బాధపడుతు చికిత్స పొందుతూన్న సందర్భంగా త్వరగా కోలుకోవాలని ఆయన ఆరోగ్యంగా ఉండాలని మాగనూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివరాం రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆనంద్ గౌడ్, సర్పంచ్ రవీందర్,ముఖ్య నాయకులు వాకిటి శ్రీనివాస్, ఉజ్జల్లి కృష్ణయ్య,దండు సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు సర్పంచులు, ఉపసర్పంచులు,మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేద మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలని సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను అత్యంత పారదర్శకంగా అమలు చేస్తుంది.

ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి:ార్కెట్‌పల్లి మండలానికి చెందిన 102 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి ఒ షాదీ ముబారక్ పథకాల చెక్కులను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అత్యంత పారదర్శకంగా అమలు చేస్తోందన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ నకిరేకల్ నియోజకవర్గంలో రహదారులు, విద్య, వైద్యం, తాగునీరు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తూ, ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యే వేముల వీరేశం కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, లబ్ధిదారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను అడ్డుకోవడం ప్రజాస్వామ్యనీకి విరుద్ధం

మాజీ దిశ కమిటీ బిఆర్ఎస్ పార్టీ జిల్లా మెంబర్ లకావత్ లక్ష్మణ్ డిమాండ్

ఖమ్మం జిల్లా, కారేపల్లి (సింగరేణి ) : లోకల్ గైడ్, జులై 18 : యువ సంగ్రామ సదస్సుకు వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువతీ యువకులను అడుగడుగునా అడ్డుకుంటూ పోలీసులు వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని సింగరేణి మండలం బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు మాజీ దిశా కమిటీ మెంబర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ లక్ష్మన్ గారు తీవ్రంగా ఖండించారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువత, ఉద్యమకారుల కుటుంబాలు, అమరవీరుల కుటుంబాలు, మహిళలు, విద్యార్థులకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, కానీ వాటి అమలులో పూర్తిగా విఫలమై ప్రజలను మోసం చేసిందని ఆయన విమర్శించారు.

కాంగ్రెస్ ఇచ్చిన ప్రధాన హామీలు:

మొదటి ఏడాదిలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదలపూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్మెంట్నెలకు ?4,000 నిరుద్యోగ భృతియువతకు ఎలక్ట్రిక్ స్కూటర్విద్యార్థులకు ?5 లక్షల విద్యా భరోసా కార్డుతెలంగాణ ఉద్యమకారులకు 250 చ.గజాల ఇంటి స్థలంతెలంగాణ అమరవీరుల కుటుంబాలకు నెలకు ?25,000 పెన్షన్, ఒక ఉద్యోగంమహిళలకు ప్రతి నెల ?2,500 ఆర్థిక సహాయంకేవలం ?500కే వంట గ్యాస్ సిలిండర్ఈ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ప్రశ్నించే గొంతులను కూడా అణచివేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని లకావత్ గిరిబాబు మండిపడ్డారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలు చేసి, యువత, మహిళలు, ఉద్యమకారుల కుటుంబాలు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయాలని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయకుండా ప్రభుత్వం వ్యవహరించాలని సింగరేణి మండలం బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ దిశా కమిటీ మెంబర్ లకావత్ లక్ష్మన్ డిమాండ్ చేశారు.

# తాండూరు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది:

# - రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.

- రూ.340 కోట్ల హ్యామ్ రోడ్ల పనులకు శంకుస్థాపన

- బైపాస్ భూ నిర్వాసితులకు రూ.25 కోట్ల పరిహారం చెక్కుల పంపిణీ.



ాండూర్: తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం తాండూరులో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో హ్యామ్ ప్రాజెక్టు కింద రూ.340 కోట్లతో చేపట్టనున్న రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రి, ఐటీ--పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దీపక్ తివారితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం హైదరాబాద్ రోడ్డు మార్గంలోని జిపిఆర్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన సభలో తాండూరు బైపాస్ భూ నిర్వాసితులకు రూ.25 కోట్ల పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.... జిల్లాలో రోడ్ల అభివృద్ధికి సుమారు రూ.900 కోట్ల నిధులు మంజూరు చేశామని, అందులో తాండూరు నియోజకవర్గానికే భారీగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు, సన్నబియ్యం, రూ.500 గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు వంటి సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తోందన్నారు. కోర్టు వివాదం పరిష్కారమైన వెంటనే రూ.94 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. తర్వాత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ అమలు చేయడంతో పాటు గ్రూప్-1, గ్రూప్-2 తదితర నియామకాల ద్వారా 70 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందన్నారు. తాండూరులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి ప్రతిపాదనలు పంపితే అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.అనంతరంఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ... తాండూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన లక్ష్యమని, సాగునీరు, రోడ్లు, వైద్యం, విద్య వంటి రంగాల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధిని వేగవంతం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన మాట్లాడితే అరెస్టులా?

# - మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ పట్లోళ్ల దీపా నర్సింలు.

- తాండూరులో బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్



తాండూరు: ప్రజల పక్షాన మాట్లాడితే హౌస్ అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసం అని తాండూరు మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ పట్లోళ్ల దీపా నర్సింలు అధికారులను ప్రశ్నించారు .శనివారం తాండూరు లో మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబుల పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు పట్లోళ్ల దీపా నర్సింలు, మాజీ డీపీసీ సభ్యులు పట్లోళ్ల నర్సింలు, బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నేతలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.తెల్లవారు జామున నేతల ఇళ్ల వద్దకు వెళ్లి నిర్బంధించారు. ఈ సందర్భంగా పలువురు బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ హాయంలో దుర్మార్గపు పాలన కొనసాగుతోందని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల గొంతు నొక్కడం, అరెస్టు చేయడం ప్రజాస్వామ్యనికి భంగం కలిగించడమే అని అన్నారు.కాంగ్రెస్ పాలనను ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

# నేడు విద్యుత్ సరఫరా లో అంతరాయం

కొందుర్గు)కొందుర్గ్: కొందుర్గ్ మండలంలోని ఉత్తరాస్పల్లి, చిన్న ఎల్కిచెర్ల సబ్ స్టేషన్ ల పరిధిలో తేదీ 19 ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుంది. రెండు సబ్ స్టేషన్ ల లో విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించడం జరుగుతుంది. అలాగే సాంకేతిక సమస్యలను పరిష్కరించడం జరుగుతుంది. అందువల్ల రెండు సబ్ స్టేషన్ ల పరిధిలోని ఉత్తరాస్పల్లి, టేకులపల్లి, మూట్ పూర్ , రేగడి చిల్కమర్రి, భైరంపల్లి, మహదేవ్ పూర్, రామచంద్ర పూర్, శ్రీరంగాపూర్, చిన్న ఎల్కిచెర్ల,పర్వతాపూర్, అయ్యవారిపల్లి, అయోధ్య పూర్ తండా లలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుంది. ఆయా గ్రామాల ప్రజలు సహరించగలరు.ఇట్లు రవికుమార్, విద్యుత్ శాఖ,ఏఈ, కొందుర్గ్.

# రేషన్ కార్డులో పేరు నమోదై న ప్రతి ఒక్కరు ఈ- కె వైసీ చేసుకోవాలి.

జిల్లేడు చౌదరిగూడెం మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు బండి. లక్ష్మి నారాయణ.

జిల్లా పౌరసరఫరాల అధికారి వనజ ఆదేశాలు.. నెల ఆఖరిదాక గడువు.

ఈ -కేవైసీ చేసుకొని కుటుంబ సభ్యుల పేర్లను రేషన్ కార్డు నుండి తొలగించబడును.



జిల్లేడు చౌదరిగూడెం.జిల్లేడు చౌదరిగూడెం మండలంలోని అన్ని గ్రామాలలో రేషన్ కార్డులో నమోదు కాబడిన సభ్యులందరు తమ తమ గ్రామాల్లోని చౌకధరల దుకాణం,రేషన్ డీలర్ల వద్దకు వెళ్లి ఈ -కే వైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని జిల్లేడు చౌదరిగూడెం మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు బండి. లక్ష్మి నారాయణ పిలుపునిచ్చారు. రేషన్ కార్డులలో కుటుంబ పెద్ద లేదా సెల్ ఫోన్ కల్గిన వ్యక్తులు మాత్రమే ఈ కే వైసీ నమోదు కల్గి ఉన్నారన్నారు.మిగిలిన మరికొంత మంది పేర్లు ఈ కే వైసీలో నమోదు చేసుకొలేదని తెలిపారు.జిల్లా పౌర సరఫరాల అధికారి వనజ రేషన్ కార్డు కల్గిన ప్రతి ఒక్క కుటుంబ సభ్యులందరు ఈ కే వైసీ చేసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.ప్రతి రేషన్ దుకాణంలో డీలర్లు అందరు ఈ కే వైసీని పూర్తికి కృషి చేయాలని కోరారు.ఈ కే వైసీ చేసుకొని వ్యక్తుల పేర్ల లిస్టును జిల్లాకు పంపించడం జరిగిందని అన్నారు.ప్రతి రేషన్ డీలర్ వారి యొక్క గ్రామాల్లో వంద శాతము ఈ- కే వైసీ ప్రక్రియను పూర్తి చేసి ప్రజలకు న్యాయం చేయాలని మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు బండి. లక్ష్మి నారాయణ మండలంలోని అన్ని గ్రామాల రేషన్ డీలర్లను కోరారు.

# అమరవీరుల స్థూపం ఆవిష్కరణను విజయవంతం చేయండి

షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలంగాణ తల్లి, షోయబుల్లా ఖాన్ విగ్రహాలను సొంత నిధులతో ఏర్పాటు చేస్తా.. షాద్ నగర్ టీయూజేఏసీ నేతలు టీజీ శ్రీనివాస్, పినపాక ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలుసుకున్న ఉద్యమ కారులు ఉద్యమ నేతలతో ఎమ్మెల్యే శంకర్ కీలక చర్చలు





షాద్ నగర్ )తెలంగాణ ఉద్యమకారులు పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉండాలని, ఉద్యమకారుల కోసం ఎలాంటి సహాయానికైనా తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తన సొంత నిధులతో నిర్మించిన తెలంగాణ అమరవీరుల స్థూపం ఆవిష్కరణను తెలంగాణ ఉద్యమకారులందరూ కలిసి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.శనివారం తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక (టీయూజేఏసీ) నాయకులుగౌరవ అధ్యక్షుడు పినపాక ప్రభాకర్, అధ్యక్షుడు టిజి శ్రీనివాస్ నేతృత్వంలో ఆయా పార్టీలకు, సంఘాలకు, మీడియాకు చెందిన ఉద్యమకారులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అమరవీరుల స్థూపం నిర్మాణానికి అభినందనలు తెలిపారు. తెలంగాణ ఉద్యమాన్ని, ఉద్యమకారుల త్యాగాలను గౌరవిస్తూ తన సొంత నిధులతో అమరవీరుల స్థూపాన్ని నిర్మించడం ద్వారా ఉద్యమంపై తనకున్న నిబద్ధతను చాటుకున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా టీయూజేఏసీ నాయకులు మాట్లాడుతూ, ధ్వంసమైన తెలుగుతల్లి విగ్రహం స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, తెలంగాణ రైతాంగ పోరాటంలో కలాన్ని గన్నుగా మార్చి పోరాడిన మహనీయుడు షోయబుల్లా ఖాన్ విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ప్రతి ఉద్యమకారుడిని గుర్తించి వారికి తగిన గౌరవం కల్పించేలా కృషి చేస్తానన్నారు. ఉద్యమకారులు ఏ సమస్యతో వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. అలాగే అమరవీరుల స్థూపం ఆవిష్కరణ కార్యక్రమం పూర్తయిన వెంటనే టీయూజేఏసీ నాయకులు కోరిన మేరకు తెలంగాణ తల్లి మరియు షోయబుల్లా ఖాన్ విగ్రహాలను కూడా తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తానని ప్రకటించారు.రేపు జరిగే అమరవీరుల స్థూపం ఆవిష్కరణ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీయూజేఏసీ సలహాదారులు వంగూరి గంగిరెడ్డి, ఎండి ఖాజా ఫాషా (కేపీ), పంది వెంకట్రాంరెడ్డి, లట్టుపల్లి మోహన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు పినపాక ప్రభాకర్, అధ్యక్షుడు టీజీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అనుముల శ్రీధర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు జాంగారి రవి, బుద్దల జంగయ్య, అదెట్ల రాజు, కోశాధికారి కొండోజు వంశీకృష్ణ, నాయకులు బిశ్వా కృష్ణయ్య, ఎన్. రతన్ నాయక్, మూల జనార్దన్, కరుణాకర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు..

# సిద్దిపేటలో ప్రత్యేక లోక్ అదాలత్ విజయవంతం

1 చెక్ బౌన్స్ కేసులో రూ.60 లక్షలు కి కేసు సెటిల్ అయింది

మొత్తం 46 చెక్‌బౌన్స్ కేసుల్లో రూ.2.78 కోట్ల రాజీ పరిష్కారం




సిద్దిపేట జులై 18:సిద్దిపేట జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఐ-అదనపు జిల్లా జడ్జి వై. జయప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎన్. సంతోష్ కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా జడ్జి వై. జయప్రసాద్ మాట్లాడుతూ, ఎన్ఐ చట్టం (చెక్‌బౌన్స్) కింద పెండింగ్‌లో ఉన్న కేసులను పరస్పర రాజీ ద్వారా త్వరితగతిన పరిష్కరించేందుకు లోక్ అదాలత్ ఉత్తమ వేదిక అని అన్నారు. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా ఒకే రోజులో కేసులను పరిష్కరించుకోవచ్చని, ఈ విషయంలో న్యాయవాదులు, పోలీసులు పార్టీలకు అవగాహన కల్పించాలని సూచించారు. అధిక సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా న్యాయవాదులు చొరవ చూపాలని కోరారు.ఈ ప్రత్యేక లోక్ అదాలత్ కోసం జిల్లాలో మొత్తం తొమ్మిది బెంచీలు ఏర్పాటు చేయగా, 46 ఎన్ఐ చట్టం కేసులు రాజీ ద్వారా పరిష్కారమయ్యాయి. దీంతో మొత్తం రూ.2,78,61,790 విలువైన క్లెయిమ్‌లకు పరిష్కారం లభించింది ఇందులో 1 చెక్ బౌన్స్ కేసులో రూ.60 లక్షలు కి కేసు సెటిల్ అయింది. కార్యక్రమంలో న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001. APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.